మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త

## రామకోటి రామరాజుకు మాతృ వియోగం

**గజ్వేల్, డిసెంబర్ 7 (ప్రభాతవార్త):** పట్టణానికి చెందిన శ్రీరామకోటి భక్తసమాజం వ్యవస్థాపకుడు రామకోటి రామరాజు తల్లి ఏడెల్లి విజయలక్ష్మి గజ్వేల్ నుండి మంగళవారం షాపూర్‌నగర్‌లో ఉన్న తన కూతురు వద్దకు బస్సులో వెళ్ళి నడుచుకుంటూ ఇంటికి వెళ్తుండగా ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. దీంతో తలకు బలమైన గాయాలు కావడంతో స్థానికులు హుటాహుటిన నారాయణ ఆసుపత్రికి తరలించగా ఐసియూలో నాలుగు గంటల పాటు చికిత్స అందించారు. అనంతరం గాంధీ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ కార్పోరేషన్ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, పద్మశాలి సంఘం అధ్యక్షుడు తలకొక్కుల దుర్గాప్రసాద్, ఆకుల నరేష్‌బాబు తదితరులు రామకోటి రామరాజును ఫోన్‌లో పరామర్శించి ధైర్యం చెప్పారు. గురువారం అంత్యక్రియలు నిర్వహించడం జరుగుతుందని రామరాజు తెలిపారు.

## డిపియం, ఏపియంల ఆధ్వర్యంలో సమాఖ్య సమావేశం

**సంగారెడ్డి మున్సిపాలిటీ, డిసెంబర్ 7, ప్రభాతవార్త:** సంగారెడ్డి పట్టణంలోని బైపా స్‌లోగల పాత డిఆర్‌డిఎ ఆవరణలోని జిల్లా సమాఖ్య కార్యాలయంలో డిపిఎం (ఫైనాన్స్), ఏపియం (ఐబి) ఆధ్వర్యంలో సిబిఓ ఆడిటర్లకు, మన జిల్లాలోని అన్ని మండల సమాఖ్య అకౌంటెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది. మండల సమాఖ్య ఆర్థిక లావాదేవీలు సమర్థవంతంగా నిర్వ హణ లో ముఖ్యమైన పాత్ర పోషించుటలో కీలకమైనది పాదర్శ కంగా పుస్తకాల న్విహణ అందరు కలిగి ఉండి మన మిత్ర సంఘాలైన గ్రామ సంఘాలకు సహాయ సహకారాలను అందించాలని తెలిపారు. డిపిఎం (ఫైనాన్స్) కొమురయ్య, ఏపియం (ఐబి) శ్రీదేవి, సిబిఓ అడిటర్లు నర్సాప్ప, లింగామూర్తి, బాల్‌రాజ్, పోచయ్య, దాసుబాబు తదితరులు పాల్గొన్నారు.



పోలీసుల అదుపులో దంపతులపై దాడిచేసిన నిందితులు

## దంపతులపై అర్ధరాత్రి దాడి-ఇద్దరిపై కేసు

**జహీరాబాద్, డిసెంబరు 7, ప్రభాతవార్త:** ఆర్టీసి బస్సు దిగి తమ ఇంటికి వెళు తున్న దంపతులపై దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ కె శ్రీకాంత్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఎస్ఐ కథనం ప్రకారం.. పట్టణా నికి చెందిన దంపతులు ఈ నెల 4వ తారీఖున రాత్రి 1 గంట ప్రాంతంలో పట్టణంలోని బ్లాక్ రోడ్డు గుండా కాలినడకన తమ ఇంటికి వెళుతుండగా పట్టణం లోని శాంతినగర్‌కు చెందిన మహమ్మద్ సూఫీయాన్, నాల్సాబ్ మహల్లాకు చెం దిన మహమ్మద్ సమీర్‌లు దండపతులను అడ్డుకుని మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ చేతులతో దాడి చేశారన్నారు. జహీరాబాద్ టౌన్ పిఎస్‌లో మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి బుధవారం ఇరువురిని అదుపులోకి తీసు కుని కోర్టులో హజరుపర్చగా ఇరువురికి జుడీషయల్ రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ శ్రీకాంత్ వివరించారు.

## 'ఏయ్ బుజ్జీ నీకు నేనే' అంటూ తెరపైకి హుస్నాబాద్ యువత



ఏయ్‌బుజ్జినీకు నేనే చలనచిత్రంలో నటించిన హుస్నాబాద్ యువత

**హుస్నాబాద్, డిసెంబరు7, ప్రభాతవార్త :** ఏయ్‌బుజ్జినీకునేనే అంటూ వెండితెరపై హుస్నాబాద్ యువతరం మూకుమ్మడిగా అలరించబోతోంది. సిద్దిపేట జిల్లా హు స్నాబాద్ ప్రాంతం నుండి మొట్టమొదటిసారిగా ఏయ్‌బుజ్జినీకు నేనే అనే చలన చిత్రం అవకాశంను దర్శకుడు సతీష్‌మెరుగు కల్పించడంతో ఈ అవకాశం దక్కి నట్లు చిత్ర మాష్టర్ పున్న రమేష్ వెల్లడించారు. ఈ చలనచిత్రాన్ని హుస్నాబాద్ పట్టణంలోని శ్రీవెంకటేశ్వర 70ఎంఎం ఏసి టాకీస్‌లో ప్రదర్శించనున్నట్లు హుస్నాబాద్ యువత పేర్కొంది. ఈ అవకాశాన్ని హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజ లు వీక్షించి ఆదరించాలని వారు వేడుకున్నారు. ఇక్కడి ప్రేక్షకుల చలువతోనే భవి ష్యత్తులో తమకు మరిన్ని అవకాశాలు వస్తాయని దాంతో హుస్నాబాద్ పేరును తెరపై చూసే చక్కని అవకాశాన్ని ప్రేక్షక దేవుళ్ల కరుణించాలని వారు ప్రాధేయ పడ్డారు. తాము చలనచిత్రంలో ఎంతో మెరుగైన ప్రదర్శనను ఇచ్చామని ఇది వీక్షకుల అనురాగంతోనే జనంలోకి వస్తేనే తమకు భవిష్యత్తు ఉంటుందని హు స్నాబాద్‌కు చెందిన చలనచిత్రంలో నటించిన పున్న రమేత్‌పాటు మామకొం రెళ్ళి, వరుకోలు శ్రీను, కళ్ళెం లక్ష్మణ్, నవీన్, ఘర్షణ, రాంబాబు, రంజిత్, వేణు తది తరులు వేడుకున్నారు. ఈ చిత్రంలో నృత్యకారులుగా సతీష్, సౌందర్య, మణి, శ్రీను, సిద్ధు, సాయిలు ఉన్నారని వివరించారు.

## ముదిరాజ్‌లకు పెద్ద పీట వేస్తున్న సర్కారు



ముదిరాజ్ సంఘ కళ్యాణ మండపం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

**కొమురవెల్లి, డిసెంబర్ 7, ప్రభాతవార్త :** టిఆర్ఎస్ సర్కారు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటీ వరకు ముదిరాజ్ కులస్తులతో పాటు ముదిరాజ్ మ త్స్యకార్మికుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందని జనగా ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యా దగిరిరెడ్డి, ఎమ్మెల్సీ బండ ప్రకాష్‌లు అన్నారు. మండల కేంద్రంలోని కొము రవెల్లిలో బుధవారం ముదిరాజ్ సంఘ కళ్యాణ మండపాన్ని ప్రారంభించి మాట్లా డారు. ముదిరాజ్‌ల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముదిరాజ్‌లను ఆర్థికంగా మరింత అభివృద్ధి చేయడానికి సర్కారు మత్స్యకార్మికులకు ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తుం దన్నారు. పేదల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న టిఆర్ఎస్ సర్కారుకు అండగా నిలువాలన్నారు. కార్యక్రమంలో మల్లికార్జున స్వామి దేవాలయ చైర్మన్ గీస బిక్షపతి, సర్పంచ్ సార్ల లతాకిష్టయ్య, జడ్పీటిసి సిల్వర్ సిద్దప్ప, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు గొల్లపల్లి కిష్టయ్య, ముదిరాజ్ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బందోబస్తులపై పోలీసులకు ఎస్పీ సూచనలు

**సంగారెడ్డి టౌన్, డిసెంబరు 7, ప్రభాతవార్త:** పోలీసు నియామక మండలి నిర్వహించనున్న దేహదారుఢ్య పరీక్షలను ఈ నెల 8వ తారీఖు నుంచి ప్రారం భం అవుతున్నందున బందోబస్తుకు వచ్చిన అధికారులకు బ్రీఫింగ్ ఇచ్చి ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ యం రమణకుమార్, ఫిసికల్ టెస్ట్ చీఫ్ సూపరిండెంట్ అదనపు ఎస్పీ బి బాలస్వామి, అదనపు ఎస్పీఉషా విశ్వనాథ్‌లు మాట్లాడుతూ సెన్సార్ పద్దతుల ద్వార లాంగ్ జంప్, షాట్ పుట్, ఎత్తు కొలతలు తీసుకునే విధానాన్ని ట్రయల్ రన్ నిర్వహిం చామ న్నారు. రన్నింగ్ ట్రాక్‌తో పాటు గ్రౌండ్ నిర్వహణ పట్ల అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. అభ్యర్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, పాటించాల్సిన పద్ద తులపై వివరించారు. సాంకేతిక పరిజ్ఞానంతో సీసీ కెమెరాల నిఘాలో ఈవెంట్ కొనసాగుతుందని, అభ్యర్థులు మధ్య వర్తుల ఉచ్చులో చిక్కుకోవద్దన్నారు. సం గారెడ్డి, జహీరాబాద్, డిఎస్‌పిలు రవీందర్‌రెడ్డి, వి రఘు, డిటిసి డీస్పీ ప్రభాకర్, ఎఆర్ డియస్పీ జనార్ధన్, యస్‌బి ఇన్స్‌పెక్టర్ మహేష్‌గౌడ్, ఆర్‌ఐలు జిల్లా సిఐలు, ఎస్ఐలు టెక్నికల్ టీం సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసు అధికారులకు సూచనలు చేస్తున్న జిల్లా ఎస్పీ రమణకుమార్

## మహిళలకు ఉపాధి శిక్షణ కోసమే..
# మహిళా ప్రాంగణం, సమైక్య భవనం

### నేడు శంకుస్థాపనలు : మంత్రి హరీష్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** మహిళలకు స్వయం ఉపాధి శిక్షణ ఇచ్చేందుకు మంత్రి హరీష్‌రావు ప్రత్యేక చొ రవతో సిద్దిపేటలో రూ.50 లక్షలతో మహిళా ప్రాంగ ణం..రూ.4 కోట్లతో జిల్లా మహిళ సమైక్య భవనం అన్ని హంగులతో అద్భుతంగా నిర్మించనున్నారు. మహిళ ప్రాంగణం. రీసోర్స్ సెంటర్లను తెలంగాణ మహిళా సహకార అభివృద్ధి సంస్థ నిర్వహిస్తుంది. ఈ కేంద్రాలను దుర్గాబాయి మహిళ శిశు వికాస కేంద్రాలు(మహిళా శిక్ష ణా కేంద్రాలు)లుగా ఆమెలో ఉన్న గొప్పతనంచ ధైర్యా న్ని మహిళలకు అందించేందుకు మహిళలు తమ కాళ్ళ మీద తామే నిలబడేలా ఉపయోగపడుతుంది. మహిళ సమైక్య భవనంలో శిక్షణతో పాటు ఉపాధి మార్గాలు ఇచ్చేలా ఏర్పాటు కానుంది. గ్రామీణ, పట్టణ నిరాశ్రయు లైన వితంతువు, కౌమారదశలో ఉన్న విద్యావంతులైన నిరుద్యోగ మహిళలకు వారి ఆర్థిక సాధికారత కోసం శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. తెలంగాణ మహిళా సహ కార అభివృద్ధి సంస్థ ద్వారా ఐసిడిఎస్ కార్యకర్తలు, కౌమారదశలో ఉన్న బాలికలు, అంగన్‌వాడీ ఉపాధ్యా యులు, సహాయకులకు శిక్షణ ఇవ్వనున్నారు. మహిళా ప్రాంగణంలో ప్రదర్శనలు, వాణిజ్య ఉత్సవాలు, కొను గోలు, అమ్మకందారుల సమావేశాలు, డిజైన్, ప్రదర్శన కేంద్రాలు మార్కెటింగ్ అవకాశాలను సులభతర చేయ దానికి ఉపయోగపడుతుందన్నారు. మహిళ సంఘాలకు శిక్షణ, ఉపాధి కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈనెల 8న మంత్రి హరీష్‌రావు చేతుల మీదుగా మహిళా సమైక్య భవనం, మహిళా ప్రాంగణం కు శంకుస్థాపన చేయనున్నారు.

**రూ. కోటితో వృద్ధాశమ నిర్మాణం**

సిద్దిపేట అర్బన్ మండలం ఎల్లుపల్లి శివారులో ఒక ఎక రం స్థలంలో మంత్రి హరీష్‌రావు కృషితో రూ.1 కోటితో వృద్ధాశ్రమం నిర్మించనున్నారు. ఈ మేరకు వృద్ధాశ్రమ నిర్మాణ పనులకు మంత్రి హరీష్‌రావు ఈనెల 8న శంకుస్థాపన చేయనున్నారు. అనాథ అభాగ్యులకు అం డగా ఆత్మీయ భరోసాగా ప్రభుత్వం వృద్ధాశ్రమాలు నిర్మి స్తుంది. మంత్రి హరీష్‌రావు ప్రత్యేక కృషితో రూ.కోటితో రాష్ట్రంలోనే మోడల్‌గా అద్భుతమైన వృద్ధాశ్రమం నిర్మిం చనున్నారు. వృద్ధాశ్రమంలో దాదాపు వంద మంది ఉం డేలా 4 రూంలు, కిచెన్ డైనింగ్ హాల్‌తో పాటు అధు నాతన సౌకర్యాలతో నిర్మించనున్నారు. పేద ఆర్థిక స్థోమత లేని అనాధులుగా ఉన్న వృద్దులకు వృద్ధాశ్రమం ఎంతగానో ఉపయోగపడుతుంది. అలాగే నంగునూర్ మండలం గట్లమల్యాలలో ప్రాథమిక అరోగ్య కేంద్రాన్ని మంత్రి ప్రారంభించడానికి తగు ఏర్పాట్లు చేశారు. గ్రా మంలోని గంగ్గిరెద్దుల, వడ్డెర కాలనీలో తాగునీటి సమ స్య పరిష్కారానికి నిర్మించిన వాటర్ ట్యాంకుతో పాటు గొర్రెల సామూహిక షెడ్లను ప్రారంభిస్తారు.



జిల్లా మహిళా సమైక్య భవనం నమూనా

## డూప్లికేట్ ఓటర్లు లేకుండా
# ఓటరు జాబితాను రూపొందించాలి

### ఎలక్ట్రోల్ రోల్ పరిశీలకులు ఐఏఎస్ అధికారి నిర్మల

**నర్సాపూర్, డిసెంబర్ 7, ప్రభాతవార్త:** డూప్లికేట్ ఓటర్లు లేకుండా సూపర్ చెక్ చేస్తు పారదర్శకంగా ఓటరు తుది జాబి తాను రూపొందించాలని ఎలక్ట్రోల్ రోల్ పరిశీలకులు ఐఏఎసన అధికారి నిర్మల పేర్కొన్నారు. బుదవారం నర్సాపూర్ ఆర్డీఓ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ హరీ స్, అదనపు కలెక్టర్ రమేశ్, ఆర్డీఓ సాయిరామ్, స్విప్ నోడల్ అధికారి రాజిరెడ్డి తో కలిపి జిల్లాలోని మెదక్, నర్సాపూర్ నియోజక వర్గాల్లో ప్రత్యేక ఓటరు నమోదుకు స్విప్ ద్వార చేపట్టిన కార్యక్రమాల ప్రగతిని పరిశీలించి ఆమె సం తృప్తి వ్యక్తం చేశారు., ఈసందర్బంగా ఆమె మాట్లాడుతూ ఫారం 6 ద్వార ఓట రు నమోదుకు సమర్పించిన దరఖాస్తులను బిఎల్ఓ లు గరుడ యాప్ లో ఆన్‌లై న్ వెంటనే చేయాలని సూచించారు. ఫారం 7 ద్వార మరణించిన వారి పేర్లను ముందుగా నోటీస్ ఇచ్చి డెత్ సర్టిఫికెట్ తీసుకున్న తర్వాత తొలిగించాలని తిరిగి అవి ఓటరు జాబితాలో కనిపించరాదని అన్నారు. అదేవిదంగా మైగ్రేటెడ్ ఓటర్లను పరిశీలించాలని ఇటుక బట్టీలు, తదితర ప్రాంతాలలో వారిని ఓటరు నమోదు చేయాలన్నారు పెండింగ్ లో ఉన్న 1057 అభ్యంతరాలను క్లైమ్‌లను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆమె సూచించారు. పాఠశాల, కళాశాలలో స్వయం సహాయక సంఘాల పారిశ్రామిక యాజమాన్యాలతో సమావేశమై ఓటరు నమో దుకు ప్రత్యేక చొరవ చూపడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అదేవిదంగా అవగా హన కార్యక్రమాల అనంతరం స్పందన ఎలా ఉందో ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని తెలిపారు. వంద శాతం లక్ష్యం సాధించిన వారికి జనవరి 25 ఓటరు దినోత్సవం నాడు ప్రత్యేక బహుమతులు ఇచ్చి ప్రొత్సహించాలని సూచించారు. ఓటరు వివరా లకు పిర్యాధులకు సంబంధించి కంట్రోల్ రూమ్‌ను నిర్వహించాలని పిర్యాధు రిజిస్టర్లను కూడ నిర్వహిస్తు వచ్చిన ఫిర్యాదుల పై తక్షణమే తగు చర్య తీసు కోవాలని సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు 81 శాతం ఆధార్ కార్డులు అనుసందానం చేయడం పై ఆమె హర్షం వ్యక్తం చేస్తు మిగతా 19 శాతాన్ని పూర్తి చేయాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ హరీష్ మాట్లాడుతూ జిల్లా కు విచ్చన 11 వేల పోటో ఓపిక్ ఓటరు కార్డులను సంబందిత అభ్యర్థులకు అందజే స్తామన్నారు. కళాశాల అంబాసిడర్ల ద్వార యువతల్లో అవగాహన కల్గించి మొబైల్ యాప్ కు ఏసిఐ పోర్టల్ ద్వార అర్హులను ఓటరుగా నమోదు చేస్తామని తెలిపా రు. 18 మరియు 19 సంవత్సరాల లోపు యువత 10 వేలకు పైగా ఉన్నారని వారందరిని ఓటర్లుగా నమోదుకు కృషి చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో అదన పు కలెక్టర్ రమేశ్, ఆర్డీఓ సాయిరామ్, స్విఫ్ నోడల్ అధికారి రాజిరెడ్డి, తహాశీల్దార్ లు, ఎలోన్ సూపరిండెంట్ శ్రీనివాస్ తదితరులున్నారు.



ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న నిర్మల



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న విద్యాధికారి రమేష్ కుమార్

## పాఠశాలల బలోపేతానికి మన ఊరు-మన బడి

**-జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్**

**వెల్దుర్తి, డిసెంబర్7 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు-మన బడి కార్యక్రమం ప్రవేశపె ట్టిందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన వెల్దుర్తి లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మన ఊరు-మన బడి కార్యక్ర మంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్, సెక్టోరియల్ అధికారి సుభాష్, సీఎంవో సూర్యప్రకాష్, మండల విద్యాధికారి యాదగిరి, నోడల్ అధికారి సాంబయ్య, ఏఈ పీఆర్ శ్రీనివాస్‌లు హాజరయ్యారు. అలాగే మం డల పరిధిలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్లు, సర్పంచులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా విద్యా ధికారి రమేష్ కుమార్ మాట్లాడుతూ మండలంలో 12 పాఠశాలలను మన ఊరు-మన బడి క్రింద మొదటి విడతలో ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 313 పాఠశాలలను ఎంపిక చేయగా, వాటిలో 260 పాఠశాలల్లో పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. మన ఊరు-మన బడికి నిధుల కొరత లేదని, ఈ నిధులను సద్విని యోగం చేసుకొని పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు. ప్రతి పదిహేను రోజులకు ఒక సారి సమీక్షా సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ప్రధానోపాధ్యాయులు రామాగౌడ్, వెంకటేశం, జాన్ వెస్లీ, ఎస్ఎంసీ చైర్మన్ వెంకటేశంతో పాటు ఆయా గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు. అనం తరం స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని వారు పరిశీలించారు.

# పత్తాలేని ఆరోగ్యకేంద్రం వైద్యులు

**-వైద్యం కోసం రోగుల పడిగాపులు**
**-సమయపాలన పాటించని సింగన్నగూడ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బంది**

**ములుగు, డిసెంబర్ 7 (ప్రభాతవార్త):** సమయపాలన పాటించని వైద్యుల తీరుకు ఓ తల్లి తన చిన్నారితో ఆరోగ్యకేంద్రం గేట్ వద్ద పడిగాపులు కాసిన సంఘటన పలువురిని ఆలోచింపజేసింది. స్వయాన రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రాతినిథ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గంలోనే వైద్యుల తీరు ఇలా ఉంటే ఇక రాష్ట్రంలో పరిస్థితి ఏంటని పలువురు అభిప్రాయపడుతున్నారు. మండల పరిధిలోని అచ్చాయిపల్లికి చెందిన మహిళకు సుందెలుక కరిచింది. దీంతో ఉద యమే తన చిన్నారితో కలిసి గ్రామంలోని విద్యార్థులు వెళ్ళే వాహనంలో సింగన్న గూడ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వచ్చింది. 9 గంటలకే తెరు చుకోవాల్సిన వైద్యశాల గేట్ ఉదయం 10 కావస్తున్నా తెరుచుకోలేదు. దీంతో ఇటు చికిత్స జరగక, తిరిగి వెళ్ళలేక ఆసుపత్రి గేట్ వద్దే చిన్నారితో చలిలో పడిగాపులు కాసింది. ఇక అక్కడికి వచ్చిన వైద్యులను సమయపాలన గూర్చి ప్రశ్నించగా కాస్త చలిగా ఉండటం వల్ల ఆలస్యమయ్యిందంటూ సమాధానమి చ్చారు. రాష్ట్ర ప్రజలకు మెరుగైన వైద్యం అందించడం ప్రభుత్వ లక్ష్యం అయితే స్వయాన ముఖ్యమంత్రి ప్రాతినిథ్యం వహించే ప్రాంతం, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు జిల్లాలోనే వైద్యుల తీరు ఇలా ఉంటే రాష్ట్రంలోని ఆరోగ్య కేంద్రాల తీరు ఎలానో అంటూ ప్రజలు మండిపడుతున్నారు. మంత్రులు పెట్టే ఎన్నో రివ్యూ మీటింగ్‌లకు హాజరవుతూ ఉండే వైద్యులకు ఈ సమయపాలన పట్టడంలేదా అంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైద్యులే కాదు ప్రభు త్వంలోని అన్ని శాఖల్లో ఇదే తంతు కొనసాగుతుందని, సమయపాలన పాటిం చని అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకొని ప్రజా శ్రేయస్సు సంఘటితం కావాలని ప్రజలు కోరుతున్నారు.





సింగన్నగూడలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

## మహాసభలను జయప్రదం చేయాలి

**-గోడ పత్రిక ఆవిష్కరణలో రాష్ట్ర కోశాధికారి**

**పటాన్‌చెరువు, డిసెంబరు 7, ప్రభాతవార్త:** ఈ నెల10, 11వ తారీఖులలో జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో నిర్వహించే తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మహా సభలను విజయవంతం చేయాలని టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి సూచించారు. బుధవారం పటాన్‌చెరువు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మహాసభ సభలను విజయం వంతం చేయాలని కోరుతూ వాల్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ బదిలీల షెడ్యూల విడుదల, సిపిఎస్ విధానం రద్దు, పాత పెన్షన్ పథకాని పునరుద్ద రించడం, అప్‌గ్రేడ్ చేసిన పండిట్ పోస్టులకు పదోన్నతులు కల్పిం చడం లాంటి సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పిం చడం జరుగుతుందన్నారు. మహాసభలో పలు తీర్మానాలను అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. మహాసభలకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏ నర్సిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి, సంగారెడ్డి ఎమ్మెల్యే తూర్పు జయప్రకాశ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బొంగుల విజయలక్ష్మి, వశిష్ట అతిథులుగా సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ రాజర్షిషా, డిఇఓ నాంపల్లి రాజేష్, వక్తులుగా టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య, ఉపాధ్యక్షులు సిహెచ్ దుర్గభవానిలు హాజరవుతున్నట్లు వివరించారు. మహాసభలకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరుకావాలని సూచించారు. కార్యక్రమంలో టిఎ స్ యుటిఎఫ్ పటాన్‌చెరువు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శు లు యేసుపాదం, ప్రభాకర్, జిల్లా కార్యదర్శి వై జ్ఞాన మంజరి, మం డల నాయకులు అరుణ, వైదూర్యం, గీతం, అంజుమ్, రామచం ద్రయ్య, లక్ష్మయ్య, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.



మహాసభల గోడపత్రికను ఆవిష్కరిస్తున్న టిఎస్ యుటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి

# ఎస్సీ వర్గీకరణ బిల్లుకై ఢిల్లీలో దండోర వేద్దాం

**కంగ్టి, డిసెంబర్ 7, ప్రభాతవార్త:** కంగ్టి మండల కేంద్రంలో స్థానిక చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం నాడు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర నాయకులు హన్మంత్ మాదిగ కరపత్రాలు విడుదల చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ కోసం ఎంఆర్‌పి ఎస్ ఇరవై ఎనిమిది సంవత్సరాలుగా పోరాటం చేస్తుంది. ఈ పోరాటానికి అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇచ్చాయి. సామాజిక న్యాయం వ్యతిరేకరించిన వాళ్ళు లేరంటే అతిశయోక్తి కాదు. చట్టసభ లోపల, వెలుపల అనుకూలంగా మాట్లా డుతూ 2014లో జరిగిన ఎన్నికల్లో అధికారంలోకి వచ్చి వంద రోజులలో ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్లో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పిస్తామని, బిజెపి తన ఎన్నికలలో ప్రకటించింది. ఐదేళ్ళ కేంద్రంలో అధికారంలో ఉండి బిల్లులు పట్టించుకోవడం లేదు, తిరిగి 2018లో అధికారంలోకి వచ్చని వర్గీకరణ బిల్లుగు రించి అసలు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా మాదిగ ప్రజలు ఏకమై పోవడా నికి సిద్ధం కావాలని ఆయన అన్నారు. ఢిల్లీలో జరిగే కార్యక్రమాన్ని విజయ వంతం చేయాల్సిందిగా కోరుతూ, డప్పులు, దరువులు, పాటలు, ఆటలు వర్గీకరణ లక్ష్యంగా ఉండాలని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎంఆర్‌పిఎస్ నాయకులు హన్మంత్ మాదిగ, మండల ఎంఆర్‌పిఎస్ నాయకులు ఎ శప్పరాజు, సమన్, అరుణ్ కుమార్, ప్రవీణ్, సీమన్ కుమార్, ప్రవీణ్ కుమార్, అభిషేక్ బాబూ, శ్రీకాంత్, సుధాకర్, పవన్, జైకర్ పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రోహిణి ప్రియదర్శిని

## మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణానికి స్థలాన్ని పరిశీలన

**మనోహరాబాద్, డిసెంబర్ 7 ప్రభాతవార్త:** మండలంలో నూతనంగా నిర్మించే పోలీస్‌స్టేషన్ స్థలాన్ని బుధవారం మెదక్ జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని పరిశీలించారు. నూతనంగా మనోహరాబాద్ మండలం ఏర్పడిన నాటి నుండి పోలీస్ స్టేషన్ ప్రైవేటు భవనంలో అరకొర వసతులతో కొనసాగుతుంది. దీంతో స్థానిక ప్రజాప్రతినిధులు పోలీస్ స్టేషన్ నిర్మాణం కోసం మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, మంత్రి హరీష్‌రావుల దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి, సీఐ శ్రీధర్, సర్పంచి చిట్కుల్ మహిపాల్‌రెడ్డి, ఎస్ఐ రాజుగౌడ్ పాల్గొన్నారు.

## డిపివోను ఘనంగా సన్మానించిన ఎంపిపి



డిపివో చక్రవర్తిని సన్మానిస్తున్న కల్లూరి హరికృష్ణ

**శివ్వంపేట, డిసెంబర్ 7 ప్రభాతవార్త:** మెదక్ జిల్లా పంచాయతీ అధికారి తరుణ్‌చక్రవర్తిని బుధవారం ఎంపీపీల ఫోరం జిల్లా అధ్యక్షుడు, శివ్వంపేట ఎంపిపి కల్లూరి హరికృష్ణ ఘనంగా సన్మానించారు. జిల్లా పంచాయతీ అధికారిగా పనిచేస్తూ బదిలీ అయిన సందర్భంగా జిల్లా కేంద్రంలో ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన ఎంపీపీ అధ్యక్షులు కల్లూరి హరికృష్ణ మాట్లాడుతూ జిల్లాకు గుర్తింపు వచ్చేలా డీపీవో చక్రవర్తి మంచి సేవలు అందించారన్నారు. డీపీవో తరుణ్ చక్రవర్తి చేసిన సేవలతోపాటు సహకారం ఎప్పటికీ గుర్తుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి కాసం నవీన్‌కుమార్, జిల్లా రైతు సమన్వయ సమితి డైరెక్టర్ సోని రవినాయక్, మండలానికి చెందిన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ విజయ్‌కుమార్

**పాపన్నపేట, డిసెంబరు 7, ప్రభాతవార్త:** పరిచయం లేని వ్యక్తులతో సెల్ ఫోన్‌లలో అనవసరమైన మాటలు మాట్లాడొద్దని, ఫోన్‌లో వచ్చే లింకులపై స్పందించరాదని ఎస్ఐ విజయ్‌కుమార్ సూచించారు. సైబర్ క్రైమ్ అవేర్‌నెస్ కార్యక్రమంలో భాగంగా ప్రతి మాసం మొదటి బుధవారం కేంద్ర హోం శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం పాపన్నపేటలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై ఎస్ఐ విజయ్‌కుమార్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సైబర్ సురక్షిత, జాతీయ భద్రత అనే అంశాలపై విద్యార్థులకు వివరించారు. ఫోన్‌లో వచ్చే ఓటిపిలను ఎట్టి పరిస్థితిలోనే ఇతరులతో పంచుకోరాదన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## లింగ వివక్షతపై విద్యార్థులకు షీటీం అవగాహన సదస్సు

**రామాయంపేట మున్సిపాలిటీ, డిసెంబర్ 7, ప్రభాతవార్త :**



మాట్లాడుతున్న ఎస్ఐ రాజేష్

షీటీం, ఐసీపీఎస్ ఆధ్వర్యంలో వాసవి జూనియర్ కళాశాలలో బుధవారం లింగ వివక్షత–2002పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులకు బాల్య వివాహాలు, పోక్సో చట్టం, బాల కార్మికులు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించడం జరిగింది. కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా ఎస్ఐ రాజేష్ హాజరై ప్రస్తుతం సమాజంలో విద్యార్థి పాత్ర, నడవడిక, వైఖరి ఏవిధంగా ఉండాలి, సమస్య ఎదురైనప్పుడు కృంగిపోకుండా వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలని, లాగే స్మార్ట్‌ఫోన్, ఇంటర్నెట్, సబర్‌నేరగాళ్ల గురించి విద్యార్థులకు వివరించారు. షీటీం కిరణ్ మాట్లాడుతూ ఎవరైనా ఈవ్‌టీజింగ్‌గాని, శారీరంగా, మానసికంగా కానీ ఏదైనా ఇబ్బందులకు గురి చేస్తే బాధితులకు అండగా షీటీమ్ ఉంటుందని, అలాంటివి ఎక్కడైనా జరిగితే షీటీం నెంబర్‌కి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది ఆంజనేయులు, మధుకర్, కళాశాల యాజమాన్యం పాల్గొన్నారు.

## ఘనంగా ఆలయ వార్షికోత్సవం

**మెదక్, డిసెంబర్ 7, ప్రభాతవార్త:** చిన్నశంకరంపేట పట్టణంలోని అనంత పద్మనాభస్వామి గుట్టపై జగద్గురు దత్తాత్రేయ స్వాములవారి 42వ వార్షికోత్సవ మహోత్సవాలను నిర్వాహకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. అచల బోదానంద యోగీశ్వర భూమి నాదం మహారాజ్ ఛాయపటాన్ని గుట్ట చుట్టూ ఊరేగించారు. అనంతరం కామాదేను యజ్ఞాన్ని నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు అలాగే సాయిబాబ దేవాలయంలో దత్తాత్రేయ స్వామి వారి ఛాయా పటాన్ని తొట్టెలలో ఉంచి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీ జ్ఞానానంద జ్ఞానేశ్వర్ మహారాజ్ వివిధ గ్రామాల భక్తులు పాల్గొన్నారు.



పద్మనాభ స్వామి గుట్టపై యజ్ఞం నిర్వహిస్తున్న వేద పండితులు

# ఎస్ఎఫ్ఐ మహాసభలను జయప్రదం చేయండి

### జిల్లా సహాయ కార్యదర్శి అజయ్‌కుమార్



మహాసభల గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

**మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 7 ప్రభాతవార్త:** భారత విద్యార్థి ఫెడరేషన్ అఖిల భారత మహాసభలు ఉస్మానియా యూనివర్సిటీలో డిసెంబర్ 13 నుండి 16వ తేదీవరకు జరగనున్నాయని, ఈ మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి అజయ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం మెదక్ పట్టణంలోని డిగ్రీ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఎస్ఎఫ్ఐ మహాసభల గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ దేశంలో విద్యారంగ సమస్యలపై రాజీ లేని పోరాటం చేస్తూ, దేశంలోని ప్రతి విద్యార్థికి సమాన విద్య అందించాలని, శాస్త్రీయ విద్యా విధానం కోసం ఎస్ఎఫ్ఐ అలుపెరుగని పోరాటం చేస్తుందన్నారు. ఎస్ఎఫ్ఐ అఖిల భాతర మహాసభలు తెలంగాణలో జరగడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో కేజీ నుండి పీజీ వరకు ఉచిత విద్య అమలుచేయాలని, సంక్షేమహాస్టళ్లలో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దేశం నలుమూలల నుండి విద్యార్థి ప్రతినిధులు హాజరు కాబోతున్నారని, భవిష్యత్తు కర్తవ్యాలు, తీర్మానాలు చేసుకొని ఉద్యమ రూపకల్పనకు ఈ మహాసభలు జరుగుతున్నాయన్నారు. ఈ సందర్భంగా జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు రాకేష్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మంచిరెడ్డి శంకుస్థాపన

**యాచారం, డిసెంబర్ 7 ప్రభాతవార్త**

మండలంలోని పలుఎ అభివృద్ధి పనులకు బుధవారం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి శంఖుస్థాపన చేశారు. జడ్పీటీసి నిధుల నుండి అండర్ డ్రైనేజి పనులను ప్రారంభించారు. అదే విధంగా చింతపట్ల, మొండిగౌరెల్లి గ్రామాల నుండి చింతపట్ల వరకు ఉన్న లింకు రోడ్డును గ్రావెల్ రోడ్డుగా మార్చుటకు నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రైనేజి, లింకు రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో నెలకొన్న మౌళిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కొప్పు సుకన్య భాష, జడ్పీటీసి చిన్నోళ్ల జంగమ్మ యాదయ్య, సర్పంచ్ బండమీది కృష్ణ, ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంపీవో రుమారాణి, ఉపసర్పంచ్ మేకల యాదగిరిరెడ్డి, కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ రాజేందర్‌రెడ్డి, పిఆర్‌ఏఈ, వార్డు సభ్యులు మొగిలి అంజమ్మ, కుంటి పాండు యాదవ్, కుంటి రేణుక, ఎట్టి మౌనిక తదితరులు పాల్గొన్నారు.

### మండల పూజోత్సవాలను నిర్వహించిన భజన మండలి కార్యకర్తలు

**కొత్తూర్, డిసెంబర్ 7, ప్రభాతవార్త :**

కొత్తూర్ పురపాలిక కేంద్రంలోని శ్రీశివమారుతి హనుమాన్ ఆలయంలో శ్రీవీరాంజనేయ స్వామి భజన మండలి ఆధ్వర్యంలో అక్టోబర్ 26వ తేది నుండి ఈనెల 5వ తేదీ వరకు మండల పూజోత్సవాలను నిర్వహించారు. ఈసందర్భంగా 41రోజుల పాటు ఆలయంలో నిత్యం పూజలు, అఖండ భజన కార్యక్రమాలను నిర్వహించారు. ఈకార్యక్రమం దిగ్విజయంగా పూర్తి అవడంతో 6న అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పిట్టల భీమయ్య, కొండారెడ్డి శంకర్, పిట్టల బాల్‌రాజ్, జాండగూడెం గోపాల్‌గౌడ్, జండగూడెం చంద్రయ్యగౌడ్, జె.రఘుపతి గౌడ్, మంగలి కృష్ణయ్య, వీరమోని మల్లేష్, ఎర్రవల్లి యాదగిరిచారి, కాంపౌండర్ నరసింహ, బండ చంద్రయ్య, ఉన్నారు.

### ఉద్యోగాల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం: కోరే జగదీష్

**యాచారం, డిసెంబర్ 7 ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల కల్పనలో విఫలమైందని కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు నాయకులు కోరే జగదీష్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిరుద్యోగ సమస్య నిర్మూలనలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్, నిరుద్యోగ సమస్య నుండి యువతకు ఉపాధి కల్పించడంలో తెలంగాణ ప్రభుత్వం విఫలమైందన్నారు. నిరుద్యోగ భృతి ఇస్తానన్న ముఖ్యమంత్రి కెసిఆర్ ఏళ్ల గడుస్తున్నా హామీని నిలుపుకోవడంలో విఫలమయ్యారన్నా రు. నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించకపోతే ప్రభుత్వాలు మనుగడ సాధించలేవని, రానున్న ఎన్నికల్లో కెసిఆర్‌కు గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు.

## పిఎం కిసాన్ ఈకేవైసీపై అవగాహన

**బొంరాస్‌పేట్, డిసెంబర్ 7ప్రభాతవార్త**

మండల పరిధిలోని గౌరారం,హంసాన్‌పల్లి,మెట్లకుంట తదితర గ్రామాల్లో పీఎంకిసాన్ ఈకేవైసీపై వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఆయా గ్రామాల్లో సర్పంచ్‌ల అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఏడీఏ శంకర్,ఏఓ పద్మావతిలు మాట్లాడుతూ... రేషన్‌కార్డు ప్రకారం ప్రతి రైతు పీఎంకిసాన్ డబ్బులు అకౌంట్‌లో జమ చేయడం జరుగుతుందని,ఇందుకుగాను భార్య,భర్తలు ఇద్దరు పట్టాదార్ ఉంటే ఎవరికో ఇకరికి మాత్రమే వర్తిస్తుందని,ఎవరి ఫోన్ నంబర్ వారికి సపరేట్‌గా ఉండాలన్నారు.ఒకటే ఫోన్ నంబర్ తండ్రి, కొడుకుకు ఆధార్ లింక్ ఉంటే ఇద్దరిలో ఒకరికి మాత్రమే డబ్బులు వస్తాయన్నారు.ఇంకొకరికి అప్పటికే ఈకేవైసీ అయినట్లు చూపిస్తుందన్నారు.కానీ డబ్బులు జమచేయబడవన్నారు. ఇందు కుగాను ఖచ్చితంగా ఏ రైతు ఆ రైతు తమ ఫోన్ నంబర్ లింక్ అయి ఉండాలని అలా ఉంటేనే డబ్బులు జమచేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో ఏఈఓ రేణుక,సీఎస్‌సీ రహిమత్ ఖాన్‌లతో పాటు ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

### మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం

**శంకర్‌పల్లి, డిసెంబర్ 7, ప్రభాతవార్త :** మతిస్థిమితంతో ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈనెల 5న రాథోడ్ రాజు వయస్సు 30సంవత్సరాల గల వ్యక్తి ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఇంట్లోనుండి వెళ్లిపోయాడని, మతిస్థిమితం ఉందని, చుట్టుపక్కల, బంధువుల దగ్గర వెతికిన ఎలాంటి అచూకిలభించలేదన్నారు. ఈసందర్భంగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

## బాధితులకు బాసటగా మేయర్ జక్కా

**బోడుప్పల్, డిసెంబర్ 7 (ప్రభాతవార్త):**

మస్కులర్ డిస్ట్రోఫి అనే జనటికల్ వ్యాధితో బాధపడుతున్న అమ్మాయిలకు చేయూతనివ్వాలని కేటీఆర్ ఆదేశాలను పీర్జాదిగూడ మేయర్ ఆచరణలో పెట్టారు. పీర్జాదిగూడ చెన్నారెడ్డి నగర్‌లో నివసించే శకుంతల, వెంకటయ్యల కుమార్తెలు ఈ వ్యాధితో బాధపడుతున్నారు. వీరికి అండగా నిలవాలని కేటీఆర్ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డిని ఆదేశించడంతో వారికి స్వయం ఉపాధిలో శిక్షణ ఇప్పించాలని మేయర్ నిర్ణయించారు. ఆయన సూచన మేరకు పీర్జాదిగూడ సెట్విన్ ఇంచార్జి వనజ బాధితుల ఇంటికి వెళ్లి సెట్విన్‌లో అందిస్తున్న వివిధ కోర్సుల గురించి అమ్మాయిలకు వివరించారు. వీటిలో ఫ్యాబ్రిక్ పెయింటింగ్, మెహిందీ, మగ్గం వర్కులపై ఆసక్తి చూపించారు. వాటిలో శిక్షణ ఇవ్వనున్నట్టు వనజ తెలిపారు. అదే విధంగా వెంకటయ్య కుమార్తె ఎం.భవాని (25) మున్సిపల్ కార్యాలయంలో ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్నారు. ఆమె కు విద్యార్హతకు తగిన ఉద్యోగం ఇస్తామని అధికారులు తెలిపారు.

### దమ్మాయిగూడ మున్సిపల్‌లో

## గ్రంథాలయం ఏర్పాటు చేయాలి

**కీసర, డిసెంబరు7, ప్రభాతవార్తః**

దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని 11 వార్డులో మారుతినగర్ నగర్ కాలనీలో ఏర్పాటు చేయాలని మున్సిపల్ చైర్మన్ వసుపతి ప్రణీత శ్రీకాంత్‌గౌడ్ బుదవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా గ్రంధాలయం చైర్మన్ దర్గా దయాకర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో శాశ్వత గ్రంధాలయ భవనం లేక విద్యార్థులు, పాఠకులు చాలా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.అందుకే మారుతినగర్ కాలనీ వాటర్ ట్యాంకు ప్రక్కన ఉన్న 300 గజాల స్థలంలో గ్రంధాలయం అన్ని సౌకర్యాలతో నిర్మించి ఇవ్వాలని కోరారు.దీనికి సానుకూలంగా స్పందించిన ఆయన త్వరలోనే శాశ్వత గ్రంధాలయ భవన నిర్మాణం చేయడానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## రాష్ట్ర అభివృద్ధి బిఆర్ఎస్ పార్టీతోనే సాధ్యం

**కీసర, డిసెంబరు7, ప్రభాతవార్తః**

రాష్ట్ర అభివృద్ధి అన్ని రంగాల్లో బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమని మండల బీఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు జలాల్‌పురం సుధాకర్‌రెడ్డి,సర్పంచ్ నాయకపు మాధురి వెంకటేష్ అన్నారు.బుదవారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని కీసరగుట్టలో ఇంటింటికి సర్వే కార్యక్రమా న్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చేపడుతున్న సంక్షేమ పథకాలు నిరుపేదలకు చేరేలా ప్రతి ఒక్క కార్య కర్త కష్టపడాలన్నారు.పేదలకు సీఎం కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నారని అన్నారు.అర్హులైన నిరుపేదలు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ఆకట్టుకున్న భోదనోపకరణాల మేళ

**ఆమనగల్లు, డిసెంబర్ 7 ప్రభాతవార్త :** విద్యాభోదనకు సృజనాత్మకత, భోధన పరికరాలు తోడైతే విద్యార్థులలో ఆసక్తి పెంపొందించి సులువుగా చదువులో మరింతగా రాటుదేలుతారని కల్వకుర్తి ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ అన్నారు. మారుతున్న కాలనుగుణంగా విద్య భోధనలో మార్పులు చేసుకోవలసిన అవసరం ఎంతైన ఉందని, అది ఉపాధ్యా యుల ఆలోచన విధానంతో ముడిపడి ఉంటుందని ఆయన అన్నారు. ఆమనగ ల్లు పట్టణంలోని ఎంఆర్‌సి భవన ప్రాంగణంలో బుధవారం ఏర్పాటు చేసిన భోధనోపకరణాల మేళను కల్వకుర్తి ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై ఎంపిపి అనితవిజయ్, జడ్పిటిసి అనురాధపత్యానాయక్‌తో కలిసి ప్రారంభించారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు, పలు పాఠశాలల విద్యార్థులు తయారు చేసిన పరికరాలను వారు తిలకించి ప్రశంసల జల్లు కురిపించారు. భోధన పరికరాలు ఎంతో ఆకట్టుకున్నట్లు ఎమ్మెల్యే ఆనందం వ్యక్తం చేశారు. విద్యాభోధనలో పోటీతత్వం పెరిగిపోవాలని అది విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అంకితభావం, క్రమశిక్షణతో విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని సూచించారు. భోధనపరికరాలను తయారు చేసిన ప్రభుత్వ ఉపాధ్యాయ బృందాన్ని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. నిర్మా ణాత్మకమైన సలహాలు సూచనలు స్వీకరించి ఉపాధ్యాయులు విద్యార్థులకు భోధనను కొనసాగించాలని రంగారెడ్డి జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు సూ చించారు. కాగా రంగారెడ్డి జిల్లాలోనే మొట్టమొదటిసారిగా ఆమనగల్లు పట్టణం లో టిఎల్ఎం మేళాను ఏర్పాటు చేసినట్లు మండల విద్యాధికారి సర్దార్‌నాయక్, నోడల్ అధికారి కిషన్‌నాయక్‌లు తెలిపారు. వారం రోజుల నుండి ఉపాధ్య యులు శ్రమించి భోధన పరికరాలను ఆకట్టుకునే విధంగా, ఉపయోగకరంగా తయారు చేసినట్లు వారు వివరించారు. టిఎల్ఎం మేళాను విజయవంతం చేసేందుకు కృషి చేసిన ఉపాధ్యాయులందరికి వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంప్లేక్స్ ప్రధానోపాధ్యాయులు పద్మ, జిల్లెల సుదర్శన్‌రెడ్డి, జంగయ్య, శంకరయ్య, ఆంజనేయులు, కాశీరావు, సుదర్శన్, రామలక్ష్మయ్య పాల్గొన్నారు.

### శంకర్‌పల్లి మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

**శంకర్‌పల్లి, డిసెంబర్ 7, ప్రభాతవార్త :**

శంకర్‌పల్లి మున్సిపల్ కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ తెలిపారు. బుధవారం ఉద్యోగ భద్రత కల్పించాలని తదితర సమస్యలపై శంకర్‌పల్లి పురపాలక సంఘం ముందు ధర్నా నిర్వహించి అనంతరం కమిషనర్‌కు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు.శంకర్‌పల్లి పట్టణ కేంద్రంలో తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మున్సిపల్ కార్మికులకు ఆంధ్రప్రదేశ్‌లో ఇస్తున్న విధంగా రూ.21వేలు ఇవ్వాలని, మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. ఈసందర ్భంగా ఆయన మాట్లాడుతూ... .శంకర్‌పల్లి మున్సిపాలిటీలో కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ పద్దతిలో పారిశుద్య కార్మికులు, డ్రైవర్లు, ఎలక్ట్రిషియన్లు, పంపు ఆపరేటర్లు, బిల్ కలెక్టర్స్, శానిటరీ జవాన్లు అనేక మంది పనిచేస్తున్నటువంటి మున్సిపల్ కార్మికులందరికి పర్మినెంట్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, అర్హులైన వారికి డబుల్ బెడ్‌రూం ఇల్లు కేటాయించాలని, దళితబంధు పథకం వర్తింపజే యాలన్నారు. శంకర్‌పల్లి మున్సిపాలిటీలో కార్మికులకు చాలా సమస్యలు ఉన్నాయన్నారు. సమస్యలు పరిష్కారం కానిపక్షంలో పెద్ద ఎత్తున్న ఆందోళన పోరాటాల నిర్వహిస్తామన్నారు. ఈకార్యక్రమంలో శంకర్‌పల్లి మున్సిపల్ వర్క ర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు బిసోళ్ల రమేష్, కోశాధికారి రా ములు, ఉపాధ్యక్షులు కృష్ణ, మల్లేష్, శాంతయ్య, మోహన్, సహాయ కార్యద ర్శులు సత్యం, లక్ష్మి, శ్రీకాంత్, కాంత్‌కుమార్, మల్లేష్, పారిశుద్ద్య కార్మికులు, వాటర్ మెన్స్, ఎలక్ట్రిషియన్లు తదితరులు ఉన్నారు.

# రామాయంపేటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

### ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు నవీన్

**రామాయంపేట మున్సిపాలిటీ, డిసెంబర్ 7, ప్రభాతవార్త :**

మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసే దిశగా స్థానిక ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి చొరవ తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు నవీన్ అన్నారు. బుధవారం రామాయంపేట పట్టణంలో ఎస్ఎఫ్ఐ ఆల్‌ఇండియా మహాసభలు జయప్రదం చేయాలని మండల కమిటీ నాయకుడు రేవంత్ ఆధ్వర్యంలో విద్యార్థుల చేతుల మీదుగా బెలూన్లు ఎగరవేశారు. అనంతరం నవీన్ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ ఆల్ ఇండియా మహాసభలు హైదరాబాద్‌లో జరుగుతున్న సందర్భంగా మండలంలో ప్రచారం కోసం బెలూన్లు ఎగరవేయడం జరిగిందన్నారు. మహాసభలలో దేశంలో విద్యారంగం బలోపేతం కోసం పలు తీర్మానాలు చేసుకోవడం జరుగుతుందని, అందులోనే రాష్ట్రంలో ఉద్యమ కార్యాచరణ తీసుకుంటామని తెలిపారు. ఇప్పటికే జిల్లాలో చదువుకుంటున్న విద్యార్థుల చాలా ఇబ్బందులు ఎదుర్కొంఉటన్నారని ఆయన అన్నారు. పీజీ, ఇంజనీరింగ్, ప్రభుత్వ ఐటీఐలు, పాలిటెక్నిక్ వంటి కళాశాలలు లేక విద్యార్థులు చదువులో వెనక పడుతున్నారని ఆయన అన్నారు. ఈ మహాసభలలో అనేక ఉద్యమ కార్యాచరణ ప్రణాళిక తీసుకొని రాష్ట్ర ప్రభుత్వానికి బుద్దిచెప్పేలా పోరాటాలు చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి రఘు, ఉపాధ్యక్షుడు రాజు, మండల నాయకులు సురేందర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




రామాయంపేటలో బెలూన్‌లను ఎగురవేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

## వైభవంగా దత్త జయంతి వేడుకలు

**మెదక్ అర్బన్, డిసెంబర్7 ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలో దత్తాత్రేయ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక బ్రాహ్మణ వీధిలోని శ్రీదత్తాత్రేయస్వామి ఆలయంలో జయంతి శోభ కనిపించింది. బుధవారం ఉదయం స్వామివారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు దేశాయిపేట పాండురంగ శర్మ ఆధ్వర్యంలో కమల్మంపేట రాధాకృష్ణశర్మ, మణికంఠశర్మ, వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ పూజలను జరిపారు. మధ్యాహ్నం హోమం చేపట్టారు. సాయంత్రం దత్తాత్రేయ స్వామి విగ్రహాన్ని పల్లకిలో ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.

**కాళ్లకల్‌లో...**

**మనోహరబాద్, డిసెంబర్ 7 ప్రభాతవార్త:** మనోహరాబాద్ మండలం కాళ్లకల్‌లో వెలిసిన దత్తాత్రేయ ఆశ్రమంలోని ఆలయంలో బుధవారం దత్త జయంతి వేడుకలను ఆలయ నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య దత్తాత్రేయ స్వామి వారికి ప్రత్యేక అర్చనలు, పూజలు, హోమం నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మెదక్ పురపాలక సంఘం కో ఆప్షన్ సభ్యురాలిగా అరవింద్‌గౌడ్ ఎన్నిక




ఏకగ్రీవంగా ఎన్నికైన అనూష అరవింద్‌గౌడ్

**మెదక్ అర్బన్, డిసెంబర్7 ప్రభాతవార్త:** మెదక్ పురపాలక సంఘం కో ఆప్షన్ మెంబర్‌గా టీఆర్ఎస్ అభ్యర్థిగా బుధవారం మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, పాలక మండలి సభ్యులు కలిసి గూడూరి అనూష అరవింద్‌గౌడ్‌ను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## కోనాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఏకరూప దుస్తుల వితరణ

**రామాయంపేట, డిసెంబర్ 7,ప్రభాతవార్త :** రామాయంపేట మండలం కోనాపూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఐరేని రవీందర్‌గౌడ్ రెండో విడతగా ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో పాఠాలు నేర్చుకుని భవిష్యత్తులో భావితరాలకు ఆదర్శంగా ఉండాలని సూచించారు. దీనితోపాటు ప్రతిరోజు తల్లిదండ్రుల ఆశీర్వాదాలు తీసుకోవాలని, పెద్దలపట్ల గౌరవభావంతో మెలగాలని, విద్యార్థులకు తెలియజేశారు. మొదటివిడతగా కొంత మంది విద్యార్థులకు గతంలోనే ఏకరూప దుస్తులు పంపిణీ చేయగా నేడు మరికొంత మంది విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో ఎస్.ఎం.సి చైర్మెన్ సుద్దనూరి విట్టల్, ఎస్.బి.ఆర్.మహేశ్వరి, జి.నాగేశ్వరరావు, మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు రేణుక, విద్యార్థులు పాల్గొన్నారు.

## 18 సంవత్సరాల వారు ఓటురుగా పేరు నమోదు చేసుకోవాలి

**పరిగి టౌన్ డిసెంబర్7,ప్రభాతవార్త :**

18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటర్ జాబితాలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని స్వీప్ నోడర్ అధికారి కోటాజీ అన్నారు. బుధవారం పరిగిలోని గిరిజన సంక్షేమ శాఖ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఓటర్ నమోదు,ఆధార్ అనుసంధానం తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఈ నెల 8వ తేది వరకు 18 సంవత్సరాలు వయస్సు పూర్తి అయిన విద్యార్థిని విద్యార్థులు అందరూ తప్పని సరిగా తమ పేర్లు ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలిపారు.ఫామ్–6 ద్వారా ఓటరు నమోదు ఫామ్ -6 ఏ ద్వారా ఆధార్ లింక్ ఫామ్ -7 ద్వారా చనిపోయిన వారి పేర్లను ఓటర్ లిస్ట్‌లో నుంచి తొలగించడం జరుగుతుందన్నారు.ఇప్పటికే ఓటరు గుర్తింపు కార్డు ఉన్నవారు తప్పనిసరిగా ఆధార్ అనుసంధానం చేయించుకోవాలని సూచించారు.ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఎన్నికలలో తప్పకుండా తమ ఓటు హక్కు వినియోగించుకొని, ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా,మంచి నాయకున్ని ఎన్నుకుంటే అలాంటి వారు ప్రజలకు మంచి సేవాలను అందిస్తారన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాల్,సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆయూష్ గ్రామ్ ప్రజలకు ఎంత ఉపయోగం

**పూడూరు, డిసెంబర్ 7, ప్రభాతవార్త :**

ఆయూష్ గ్రామ్ కార్యక్రమం ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు అంతగానో ఉపయోగ పడుతుందని ఎంపిపి పూడుగుర్తి మల్లేశం,జడ్పీటీసీ మేఘమాల ప్రభాకర్‌గుప్తలు పేర్కొన్నారు.నేషనల్ ఆయూష్ మిషన్ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆయూష్ విభాగం వారి దత్తత గ్రామం పూడూరు మండలం పరిధిలోని సోమన్‌గుర్తిలో గురువారం చివరి విడత ఆయూష్ గ్రామ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ వారు మాట్లాడుతూ ఎలాంటి వాధులు ప్రభలకుండా ఆరోగ్యంపట్ల ప్రతి ఒక్కరు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఈ వైద్య శిభిరంలో చూయించుకున్న రోగులకు ఉచితంగా చికిత్సలు చేయడం,ఆయుర్వేదిక్ మందులను అందజేయడంతోపాటు గర్భినీ స్త్రీలు,విద్యార్థులకు యోగా ద్వారా ఆరోగ్యవంతులుగా ఉండే విధానం,ఆహారపు అలవాట్ల పట్ల అవగాహన కల్పించడం అభినందనీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంధ్యా భాస్కర్‌రెడ్డి,మండల టిఆర్ఎస్ పార్టీ నాయకులు సుభాన్‌రెడ్డి,భాస్కర్‌రెడ్డి,ఎస్ఎంసీ చైర్మన్ వెంకటేష్,ప్రోగ్రాం ఆఫీసర్ మహ్మద్ మక్బుల్ హుస్సేన్,క్యాంపు ఇంచార్జి డాక్టర్ గాయత్రీ,డాక్టర్ వెంకటేశ్వర్లు,విశ్వంబర్,రజినీచందర్ శ్రీనివాస్, శంకరయ్య,నరేష్,వెంకటేశ్వర్లు,చంద్రశేఖర్, ప్రధానోపాధ్యాయులు అంజిలయ్య,పంచాయతీ కార్యదర్శి అబ్దుల్లా,ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## కుల్కచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా మాధురి

**కుల్కచర్ల డిసెంబర్ 7,ప్రభాతవార్త :**

వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిణిగా డాక్టర్ మాదురి నియమించబడ్డారు.చిట్యాల ఆరోగ్య కేంద్రంలో 5 సంవత్సరాలుగా విధులు నిర్వహించి అందరి అభిమానాన్ని సంపాదించుకున్న మాధురి కుల్కచర్లకు రావడం సంతోషకరమని సిబ్బంది తెలిపారు.ఇప్పటివరకు విధులు నిర్వహించిన డాక్టర్ మురళికృష్ణ ఉన్నత విద్య పిజి సీటు రావడం తో ఆయన అక్కడికి వెళుతున్నారు.ఈ సందర్భంగా కొత్తగా నియమితులైన మాధురి మాట్లాడుతూ విధుల పట్ల అంకిత భావంతో పనిచేస్తారరి ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా కృషి చేస్తారరి ఆమె తెలిపారు. అనంతరం ఆమెను సిబ్బంది ఘనంగా సన్మానించారు. మాధురి కుల్కచర్లలోనే సిహెచ్ఒగా విధులు నిర్వహిస్తున్న చంద్రప్రకాష్‌కు కూతురు కావడం కొసమెరుపు.ఈ కార్యక్రమం లో వైద్యాదికారి మురళికృష్ణ,సిహెచ్ఒ చంద్రప్రకాష్,ఎమ్ఎల్‌హెచ్‌పి శృతి, స్టాఫనర్స్ ఫాతిమ,ఫార్మసిస్ట్ మల్లేష్,ఆఫ్తాలిక్ అసిస్టెంట్ జవహర్, సిరాజ్, రఫి,యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.



జగిత్యాలకు తరలివెళ్తున్న టిఆర్ఎస్ శ్రేణులు

## జగిత్యాలకు తరలివెళ్లిన టిఆర్ఎస్ శ్రేణులు

**బెజ్జంకి, డిసెంబర్ 7, ప్రభాతవార్త :** జగిత్యాల జిల్లాలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలతోపాటు, సిఎం కెసిఆర్ బహిరంగసభకు మండల పరిధిలోని ప్రజాప్రతినిధులు, టిఆర్ఎస్ శ్రేణులు బుధవారం భారీగా తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో పార్టీ మండల అధ్యక్షులు పాకల మహిపాల్‌రెడ్డి, సర్పంచ్‌లు తదితరులు ఉన్నారు.

## టీఎన్జీవో జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా భూరెడ్డిగారి తార



నియామకం పత్రాన్ని అందుకుంటున్న భూరెడ్డిగారి తార

**తొగుట, డిసెంబర్ 7, ప్రభాతవార్త :** తెలంగాణ నాన్ గెజిటెడ్ వెటర్నేరియన్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి సంఘంలో ఇటీవల ఎన్నికలు జరిగాయి ఈ సెంట్రల్ అసోసియేషన్‌లో సిద్దిపేట జిల్లా నుంచి భూరెడ్డిగారి తారను జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా బాధ్యత ఇచ్చినందులకు రాష్ట్ర సంఘానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శుల చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో నరేష్, సంతోష్‌కుమార్, సైదలక్ష్మీ, శ్రీనివాస్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## పద్మశాలి సంఘం మండల కమిటీ ఎన్నిక



పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం

**కొమురవెల్లి, డిసెంబర్ 7, ప్రభాతవార్త :** మండల పరిధిలోని రసులాబాద్ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో బుధవారం పద్మశాలి సంఘం మండల కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా చిప్ప శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా పాశికంటి కృష్ణ, సిరిముల్లా ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా కొంక చంద్రకాంత్, కోశాధికారిగా బీమనపల్లి రమేష్, సలహాదారులు కొంక రవి, కార్యవర్గ సభ్యులుగా వేముల బలరాం, అడెపు శ్రీనివాస్, చర్ల నారాయణ, ఇప్పకాయల నర్సింహులు, వేముల శ్రీశైలం లను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా సిరిముళ్ల సత్యనారాయణ వ్యవహరించారు. కార్యక్రమంలో మండల పరిధిలోని పద్మశాలి సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

### మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

**సిద్దిపేట రూరల్, డిసెంబర్ 7, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం నిర్వహిస్తున్న కంటి వెలుగు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ కడవెర్గు మంజులరాజనర్సు అన్నారు. బుధవారం పట్టణంలోని 23, 24వ వార్డులలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వెలుగు వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఉచిత వైద్య శిబిరంలో కంటిపరీక్షలు నిర్వంచి అపరేషన్లు అవసరం ఉన్నవారిని గుర్తించి చేయించడం జరుగుతుందన్నారు. ఎలాంటి ఖర్చులు లేకుండా మంత్రి సహకారంతో ఉచితంగా కంటి అపరేషన్లు చేయించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నాయకం లక్ష్మణ్, డిఎంఅండ్‌హెచ్‌ఓ కాశీనాథ్, డాక్టర్ శ్రీకాంత్, హెచ్ఈఓ జాకీర్, సూపర్‌వైజర్ మహేందర్, ఎఎన్ఎం శ్రీవాణి, అశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్ల అందజేత




సర్టిఫికెట్లుతో మహిళలు

**చిన్నకోడూరు, డిసెంబర్ 7, ప్రభాతవార్త :** నాబార్డు సహకారంతో ఐడియా రూరల్ డెవలఫ్‌మెంట్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండల పరిధిలోని రామంచ గ్రామంలో మగ్గం వర్క్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌పై శిక్షణ ఇచ్చారు. 15 రోజుల పాటు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు బుధవారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాబార్డు డీడీఎం సెసిల్‌తిమోతి మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు సొంతంగా యూనిట్లుస్థాపించుకొని మహిళా వ్యాపారవేత్తలుగా ఎదగాలన్నారు. అర్థిక సహకారాన్ని బ్యాంకుల ద్వారా లేదా శ్రీనిధి ద్వారా సమకూర్చుకొని తిరిగి చెల్లించాలన్నారు. ఎపిఎం మహిపాల్, స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ రాజలింగం తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో సీసీలు కొమురయ్య, శ్రీనివాస్ రెడ్డి, సీఏ పద్మ, మాస్టర్ ట్రైనర్ వాసవి, మహిళలు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ రహిత సమాజమే లయన్స్ క్లబ్ ధ్యేయం

**మర్కుక్, డిసెంబర్ 7 (ప్రభాతవార్త):**

ప్లాస్టిక్ వాడితే అనర్థమని, ప్లాస్టిక్‌పై యుద్ధం ప్రకటించి ప్లాస్టిక్ రహిత సమాజమే లయన్స్‌క్లబ్ ధ్యేయమని లయన్ మాధవి అన్నారు. బుధవారం మండల పరిధిలోని అంగడి కిష్టాపూర్ గ్రామ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి కాగితంతో తయారుచేసిన సంచులను వాడాలని సూచించారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు నోటు బుక్స్, ఉపాధ్యాయినిలకు, ఆయమ్మలకు లయన్స్‌క్లబ్ వారు చీరలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు ఓంకార్ రాధాకృష్ణ మాట్లాడుతూ మా పాఠశాలకు ఎల్లవేళలా సహకరిస్తున్న లయన్ మాధవి, అరుణలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఆర్‌కె.రెడ్డి, చిన్నికృష్ణ, నవీన, సరిత, కృష్ణవేణి, హసీనా, నీరజ తదితరులు పాల్గొన్నారు.

# రమేష్ ఆత్మహత్యకు కారకులైనవారిని అరెస్టు చేయాలి

## బిజెపి జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

ఇటీవల సిద్దిపేట కలెక్టరేట్ ప్రాంతంలో ఆత్మహత్యకు ఒడిగట్టిన రమేష్ మృతికి కారణమైన కౌన్సిలర్‌తోపాటు మున్సిపల్ మాజీ చైర్మన్ కడవెర్గు రాజనర్సులపై హత్యాయత్నం కింద నాన్ బెయిల్ కేసులు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. రమేష్ మృతికికారణమైన కౌన్సిలర్ ప్రవీణ్ కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్‌లను అరెస్టు చేయడంలో పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నారని వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ బిజెపి అధ్వర్యంలో బుధవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. బిజెపి కార్యాలయం నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగుతూ సిద్దిపేట పాత బస్టాండుకు చేరుకుంది. అనంతరం రోడ్డుపై బైటాయించి ప్రవీణ్‌కుమార్, రాజనర్సులను అరెస్టు చేయాలని పార్టీ శ్రేణులు పెద్దఎత్తున నినాదాలు చేశ్శారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ కేసును నీరు కార్చాలని చూస్తే వదిలే ప్రసక్తి లేదన్నారు. రమేష్ సెల్ఫీ వీడియో తీస్తూ తన చావుకు కారణంతోపాటు డబుల్‌బెడ్‌రూం రాకుండా కౌన్సిలర్ అడ్డుకున్నాడని దీనికి మున్సిపల్ మాజీ చైర్మన్ పరోక్షంగా సహకరించారని అవేదన చెందుతూ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. రమేష్ మృతికి కారకులైన వారిని మంత్రి హరీష్‌రావు ప్రోద్బలంతోనే పోలీసులు అరెస్టు చేయడం లేదని మండిపడ్డారు. రమేష్ మృతికి కారణమైన వారిని అరెస్టు చేసేవరకు బిజెపి ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామన్నారు. మృతుడి కుటుంబానికి రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేసియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. వారిని అరెస్టు చేయడంలో ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా ఈనెల 9న సిద్దిపేట బంద్‌కు పిలుపునిస్తామన్నారు. అందోళనకారులను అరెస్టు చేసి వన్‌టౌన్ స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు శ్రీనివాస్ యాదవ్, గుండ జనార్ధన్, నరేష్, వెంకటేశం, పర్శ రాములు, శ్రీనివాస్‌రెడ్డి, కుమారస్వామి, తిరుపతి రావు, శివకుమార్, సత్యనారాయణ, శ్రీనివాస్, యాదన్‌రావు, నరేష్, పద్మ, ఇంద్రాణి పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న బిజెపి శ్రేణులను అరెస్టు చేస్తున్న పోలీసులు



మాట్లాడుతున్న సింగాయిపల్లి గోపి

## రాబోయే ఎన్నికల్లో బిజెపి జెండా ఎగరవేయడం ఖాయం

### రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సింగాయిపల్లి గోపి

**నర్సాపూర్, డిసెంబర్ 7, ప్రభాతవార్త :** రానున్న ఎన్నికల్లో నర్సాపూర్‌లో బిజెపి జెండాను ఎగర వేయడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి సింగాయిపల్లి గోపి, అసెంబ్లీ కన్వీనర్ వాల్దాస్ మల్లేస్‌గౌడ్ అన్నారు. బుధవారం బిజెపి మండల అధ్యక్షుడు నర్సింగరావునాయక్ ఆధ్వర్యంలో మండలస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ వచ్చే స్థానిక ఎన్నికల్లో బిజెపి జెండాను ఎగుర వేయాలని, ఇందుకోసం ప్రతి కార్యకర్త పార్టీని గ్రామాల్లో బలోపేతానికి కృషి చేయాలన్నారు. అంతేగాక వచ్చే స్థానిక ఎన్నికల్లో బిజెపి నాయకులు సర్పంచ్‌లుగా, ఎంపిటిసీలుగా, వార్డు సభ్యులుగా పోటీ చేసి గెలుపొందాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి సంగసాని సురేశ్, మండల అధ్యక్షుడు నర్సింగరావునాయక్, పట్టణ అధ్యక్షుడు అంజనేయులుగౌడ్, రవిగౌడ్, ప్రేమ్‌కుమార్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి మిత్రుల సహాయం

**కొండపాక, డిసెంబర్ 7, ప్రభాతవార్త :** దుద్దెడ గ్రామానికి చెందిన ఎండి. యూసుఫ్ గుండెపోటుతో బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న 1990-91 పదో తరగతి స్నేహితులు బాధిత కుటుంబానికి ఆసరగా నిలిచారు. కపేదరికంతో జీవించిన యూసుఫ్ కుటుంబ సభ్యులకు తమ వంతు సహాయంగా రూ. లక్ష అందజేశారు. కార్యక్రమంలో వడ్లకొండ శ్రీనివాస్, పబ్బోజు అంజనేయులు, చిలుముల నరహరి, బొజ్జ మహదేవ్, స్వామిదాస్, అంబదాస్ తదితరులు పాల్గొన్నారు.

## అనాథ యువతికి వివాహం జరిపించిన ప్రజాప్రతినిధులు, అధికారులు

**వర్గల్, డిసెంబర్ 7 (ప్రభాతవార్త):**



అనాథ అమ్మాయి వివాహాన్ని జరిపిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

వర్గల్ మండలం నాచగిరి దేవాలయం వద్ద దాతల సహకారంతో తల్లి దండ్రులులేని మౌనికకు ఎండపల్లి నర్సింహతో బుధవారం జిల్లా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల సంక్షేమ సమితి సభ్యుడు దేశబోయిన నర్సింలు, బాలల పరిరక్షణ అధికారి రాజు, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రాంగోపాల్‌రెడ్డిల చేతులమీదుగా వివాహం జరిపించారు. మౌనిక, నరసింహల వివాహానికి నాచగిరి ఆలయ చైర్మన్ హన్మంతరావు పుస్తెమట్టెలు, కళ్యాణ మండపం, పురోహితుల ఖర్చులు అందజేశారు. అలాగే ఇందుప్రియాల్ గ్రామ అంగన్‌వాడీ టీచర్ మహ్మద్ సుల్తాన ఉమర్ వాషింగ్‌మిషన్, మర్కుక్ జెడ్‌పిటిసి ఎంబరి మంగమ్మరాంచంద్రం బంగారు ఉగరం, గజ్వేల్ చెలిమి ఫౌండేషన్ వారు వంట పాత్రలు, బడి బాసన్న, ఆపన్న హస్త మిత్ర బృందం గజ్వేల్ వారు బెడ్, బీరువా, వంట పాత్రలు, సిద్దిపేటకు చెందిన స్వప్న కిరాణా సామాగ్రి, వర్ష వెండి ఆభరణాలు, పెళ్ళి బట్టలు అందజేశారు. ఇదిలా ఉండగా చాలామంది దాతలు తమకు తోచిన విధంగా సహకారాన్ని అందించారు. ఈ వివాహ వేడుకలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డిసి చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, బాలల సంక్షేమ సమితి సభ్యులు అంజమ్మ, మంజుల, కో-ఆర్డినేటర్ మమత, డిసిపిఓ రాము, సిడిపిఓ వెంకటరాజమ్మ, బాలల పరిరక్షణ అధికారులు బూర్గుపల్లి రాజు, రమేష్, రాజు, మహేష్, నాగరాజు, నర్సింలు, ఏఎంసి డైరెక్టర్ శీలసారం ప్రవీణ్, నాచారం ఆలయ సిబ్బంది సుధాకర్‌గౌడ్, నరేందర్‌గౌడ్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



అయ్యప్ప దేవాలయ నిర్మాణానికి రూ. 4 లక్షల విరాళం అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్ తదితరులు

## అయ్యప్ప దేవాలయ నిర్మాణానికి రూ. 4 లక్షల విరాళం

**నర్సాపూర్, డిసెంబర్ 7, ప్రభాతవార్త :** నర్సాపూర్ పట్టణ సమీపంలోని హైదరాబాద్‌కు వెళ్లే ప్రధాన రహదారి పక్కన నిర్మిస్తున్న అయ్యప్పదేవాలయ నిర్మాణానికి బుధవారం నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్ రూ. 4 లక్షల విరాళం ప్రకటించి నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములు ఈ నెల 8 నర్సాపూర్‌లో నిర్వహించే అయ్యప్ప మహపడిపూజా కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్‌ను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప దేవాలయ నిర్వాహకులు అశోక్ గౌడ్ స్వామి, రమేశ్‌గౌడ్ స్వామి తదితరులు ఉన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

**కొండపాక, డిసెంబర్ 7, ప్రభాతవార్త :** కుకునూర్‌పల్లి మండల కేంద్రానికి చెందిన పాల భవానికి బుధవారం సిఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.22,500 చెక్కును మాజీ సర్పంచ్ బోడపట్ల ఐలం యాదవ్, గజ్వేల్ అత్మకమిటీ డైరెక్టర్ పాల శంకర్ పంపిణీ చేశారు. కార్య క్రమంలో పాల శ్రీనివాస్, పాల నరేష్‌గౌడ్, రవి, అజారుద్దీన్ పాల్గొన్నారు.

## కనుల పండుగలా అయ్యప్పస్వామి పడిపూజ మహోత్సవం

**శివ్వంపేట, డిసెంబర్7 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో వజ్జ ప్రవీణ్ కన్నె స్వామి నివాసంలో బుధవారం హరిహరుల పుత్రుడు శ్రీ అయ్యప్ప స్వామి పడిపూజ మహోత్సవం కన్నుల పండుగలా జరిగింది. అయ్యప్ప స్వామి పడిపూజను పురస్కరించుకొని సన్నిధానంతో పాటు పద్దెనిమిది మెట్ల పడిని సుందరంగా అలంకరించారు. ఉదయం నుండి ప్రారంభమైన ఈ పూజా కార్యక్రమంలో గణపతిపూజ, సుబ్రహమణ్య స్వామి పూజతో పాటు పుష్పాలంకరణ, అభిషేకం, పంచామృతాలతో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుండి మాలాధారణ పొందిన అయ్యప్ప స్వాములు పెద్దఎత్తున హాజరై స్వామి వారి కృపకు పాత్రులయ్యారు. వజ్జ ప్రవీణ్ కన్నె స్వామి పద్దెనిమిది మెట్ల పడిని వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. అయ్యప్ప స్వాములు కీర్తనలతో పాటు పెద్దఎత్తున భజన కార్యక్రమాలు చేయడం జరిగింది. పడిపూజ కార్యక్రమానికి హాజరైన అయ్యప్ప స్వాములతో పాటు భక్తులకు ప్రవీణ్ కన్నె స్వామి ఆధ్వర్యంలో అన్నదాన వితరణ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అన్నారం రవి పంతులు స్వామి, ఇసుగారి మల్లేష్ గురుస్వామి, కె. సత్యనారాయణగౌడ్ గురుస్వామి, క్యాసని వెంకటేష్ గురుస్వామి, వజ్జ సత్యనారాయణ గురుస్వామి, ఇసుగారి అరుణ్ గురుస్వామి, వజ్జ శ్రీనివాస్ గురుస్వామి, ఇసుగారి రాము గురుస్వామి, కృష్ణాగౌడ్ గురుస్వామి, వజ్జ హరి స్వామి, సందీప్ స్వామి, వజ్జ నాగరాజు, స్వామి, వజ్జ రాజు, స్వామి, సదల యాదగిరి స్వామి తదితరులు పాల్గొన్నారు.

## బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

**నర్సాపూర్, డిసెంబర్ 7, ప్రభాతవార్త :** బైక్ అదుపుతప్పి ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన నర్సాపూర్ పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ గంగరాజు కథనం ప్రకారం... నర్సాపూర్ పట్టణానికి చెందిన శేక్ వెంకటేశ్ (37) వ్యవసాయ బోర్‌వెల్ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడని తెలిపారు. ఈక్రమంలో మంగళవారం బోర్ బండి మండల పరిధిలోని నత్నాయపల్లి గ్రామంలో బోర్ వేయడానికి వెళ్లినట్లు తెలిపారు. ఈబోర్ రాత్రి పూట వేస్తుండటంతో అక్కడకు బైక్‌పై రాత్రి 11 గంటలకు బయిలుదేరాడని తెలిపారు. కాగా నర్సాపూర్ హైదరాబాద్ ప్రధాన రోడ్డులోని అయ్యప్పస్వామి ఆలయం వద్దకు రాగానే రోడ్డుకు అడ్డంగా ఒక అడివి జంతువు వచ్చిందని చెప్పారు. జంతువును తప్పించబోయి బౌక్ అదుపుతప్పి రోడ్డుపై ఉన్న సిల్వర్ గ్రిల్స్‌కు ఢీకొనగా తలకు బలమైన గాయం అయినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న భార్య చంద్రకళ బంధువులతో కలిసి సంఘటన స్థలానికి వెళ్లి 108 అంబులెన్స్‌లో నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరిలించారు. కాగా అక్కడ డ్యూటీలో ఉన్నడ డాక్టర్ పరీక్షించి మృతి చెందాడని చెప్పినట్లు తెలిపారు. మృతుడి భార్య చంద్రళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గంగరాజు తెలిపారు.

# క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానానికి ఎదగాలి

## -ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

**గజ్వేల్, డిసెంబర్ 7 (ప్రభాతవార్త):**

తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ముచేయకుండా క్రమశిక్షణతో చదివి ఉన్నతస్థానానికి ఎదగాలని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి విద్యార్థులకు సూచించారు. గజ్వేల్ మండలం రిమ్మనగూడ గ్రామ సమీపంలోని సురభి దయాకర్‌రావు ఫార్మసీ కళాశాలలో బుధవారం జరిగిన మొదటి సంవత్సరం విద్యార్థుల ఓరియంటేషన్ కార్యక్రమానికి ఎమ్మెల్సీ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మసీ రంగంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయని, గతంలో కళాశాలల సంఖ్య తక్కువగా ఉన్నప్పుడు గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు అవకాశాలు తక్కువగా దక్కేవని, తెలంగాణ వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి కెసిఆర్ జిల్లాకో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. ప్రస్తుతం విద్యార్థులు చదువుకోవడానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని వాటిని ఉపయోగించుకొని ముందుకు వెళ్ళాలన్నారు. కళాశాల సెక్రటరీ, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి అన్ని వసతులు కలిగిన ఫార్మసీ కళాశాల ఏర్పాటుచేసి ఈ ప్రాంత విద్యార్థులకు ఉపయోగపడేలా చేయడం అభిందనీయమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటరమణ మాట్లాడుతూ కళాశాలలో పూర్తిస్థాయిలో లాబ్‌లు, లైబ్రరీ, సుదీర్ఘ అనుభవం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారని, ప్రస్తుతం ఫార్మా రంగంలో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, విద్యార్థులు వారి కోర్సు పూర్తిచేసిన వెంటనే ఉద్యోగ అవకాశాలు వస్తున్నాయని తెలిపారు.

అనంతరం కళాశాలలో గత సంవత్సరం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థు లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది డాక్టర్ శేష ఫణీంద్ర, డాక్టర్ ఆర్.నిర్మల, సిహెచ్.నరేష్‌రెడ్డి, సౌమ్య, సౌందర్య, స్నేహ, భారతి, ఈశ్వర్, పూజిత, మమతరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ప్రవీణ్, కృష్ణ, అరుణ, ప్రవీణ్, విద్యార్థులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి తదితరులు



మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

## హుస్నాబాద్‌లో సబ్ కోర్టు ఏర్పాటు చేయండి

### -మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి చాడ వినతి

**హుస్నాబాద్, డిసెంబరు 7, ప్రభాతవార్త :** హుస్నాబాద్‌కు సబ్‌కోర్టు అవసరం ఎంతో ఉందని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి అన్నారు. బుధవారం రాష్ట్ర న్యాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్, హుస్నాబాద్ న్యాయవాదులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ హుస్నాబాద్‌కు సబ్‌కోర్టు అవసరం ఉందని ప్రస్తుతం ఉన్న సబ్‌కోర్టు హుస్నాబాద్‌కు 40 కిలోమీటర్ల దూరంలో ఉందని, ఇక్కడే ఉంటే కక్షిదారులకు న్యాయ సేవలు సులభంగా అందుతాయన్నారు. సబ్‌కోర్టు విషయంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉండాలని ఆయన చెప్పారు.

**సబ్‌కోర్టు ఏర్పాటు చేయాలని ఆర్డీవో కార్యాలయంలో వినతి...**

హుస్నాబాద్‌కు సబ్‌కోర్టు మంజూరు చేయాలని వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ హుస్నాబాద్ నియోజకవర్గ నాయకులు అయిలేని మల్లిఖార్జునరెడ్డి డిమాండ్ చేశారు. హుస్నాబాద్‌కు కోర్టు మంజూరు చేయాలని రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కంది శ్రీనివాస్, బడుగు రమేష్, జాటోతు సంతోష్, జానకి రామ్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, మోహన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయాలి

### పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గడిపె మల్లేష్

**హుస్నాబాద్, డిసెంబరు 7, ప్రభాతవార్త :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) హుస్నాబాద్ జనరల్ బాడీ సమావేశం ఈనెల 8న హుస్నాబాద్ పట్టణంలోని అణభేరి, సింగిరెడ్డిల అమరుల భవన్‌లో నిర్వహించడం జరుగుతుందని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గడిపె మల్లేష్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డితో పాటు జిల్లా కార్యదర్శి మంద పవన్ హాజరవుతున్నారన్నారు. ఈ కార్యక్రమానికి హుస్నాబాద్ నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు యువతి, యువకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## దహన సంస్కారానికి ఎమ్మెల్యే ఆర్థిక సహాయం

**అక్కన్నపేట, డిసెంబరు 7, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో అబ్రబోయిన భాగ్య బుధవారం అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ వారి దహన సంస్కారానికి ఆర్థిక సహాయాన్ని ఎంపిపి మాలోతు లక్ష్మీభీలునాయక్, జడ్పిటిసి భూక్య మంగ శ్రీనివాస్ ద్వారా అందజేసి వారి కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేశారు. అంత్యక్రియలకు హాజరైన నాయకులు భాగ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంత్యక్రియలకు హాజరైన వారిలో టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పెసరు సాంబరాజు, గొల్లకుంట సర్పంచ్ కాశబోయిన యాదగిరి, టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నక్క రాజు, మిట్టపల్లి రాజు, గుగులోతు కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## నాచగిరిలో ఘనంగా దత్త జయంతి



పూర్ణాహుతి నిర్వహిస్తున్న వేదపండితులు

**వర్గల్, డిసెంబర్ 7 (ప్రభాతవార్త):** మండలంలోని నాచగిరి శ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానంలోగల ఉపదేవాలయమైన దత్తసాయి మందిరంలో బుధవారం దత్త జయంతి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, పుణ్యావాచనము, రక్షాబంధనము, స్వామివారికి విశేష పంచామృత అభిషేకం, మూలమంత్ర రుద్రహవనం, మహా పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. దత్తజయంతి కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ హనుమంతరావు, కార్యనిర్వహణాధికారి కట్ట సుధాకర్‌రెడ్డి, వేదపండితులు, భక్తులు పాల్గొన్నారు.

## సైబర్ క్రైమ్‌పై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సంపత్‌కుమార్

**వర్గల్, డిసెంబర్ 7 (ప్రభాతవార్త):** వర్గల్ మండలం గౌరారం గ్రామంలో గల డెక్కన్ పబ్లిక్ స్కూల్‌లో బుధవారం గౌరారం ఎస్ఐ సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్‌పై విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలు ఫోన్ చూస్తున్నప్పుడు కానీ ఇతర ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతున్నప్పుడు కానీ ఎలాంటి అనుమానాస్పద లింక్‌లు ఓపెన్ చేయకూడదని, ఒకవేళ ఎవరైనా ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పోగొట్టుకున్నా వెంటనే హెల్ప్ లైన్ నెం.1930కు ఫోన్ చేసి తమ యొక్క వివరాలు, బ్యాంక్ అకౌంట్ వివరాలు నమోదుచేయాలని వివరించారు. అనుమానిత వ్యక్తులు ఎవరైనా ఫోన్ చేసినా బ్యాంక్ అకౌంట్ వివరాలు తెలపకూడదన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## రేషన్ డీలర్ల నూతన కార్యవర్గం

**మిరుదొడ్డి(భూంపల్లి అక్బర్‌పేట), డిసెంబర్ 7,**

ఇటీవల నూతనంగా ఏర్పడిన అక్బర్‌పేట భూపంపల్లి మండల రేషన్ డీలర్ల నూతన కార్యవర్గాన్ని రేషన్ డీలర్ల జిల్లా గౌరవ అధ్యక్షులు మంద లక్ష్మారెడ్డి, జిల్లా అధ్యక్షులు కూర ప్రకాష్, తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల ఉపాధ్యక్షులు వంగరి నాగరాజు, జిల్లా కార్యదర్శి బొజ్జ నరేందర్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షులుగా జూలూరి నాగభూషణం, అధ్యక్షులుగా అరుట్ల నారాయణరెడ్డి, కార్యదర్శిగా పప్పుల నరేందర్, కోశాధికారిగా ముక్క శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా ఈ.స్వామి, సంయుక్త కార్యదర్శిగా బొరిమండ్ల మల్లేశం, సలహాదారులుగా రాజయ్య, రామ స్వామి, పీఆర్ఓగా నర్సింహులును మండల రేషన్‌డీలర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



భూంపల్లి అక్బర్‌పేట రేషన్ డీలర్ల నూతన కార్యవర్గం

## మత్స్యకారులను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యం: రోషన్‌రెడ్డి

**సిర్గాపూర్, డిసెంబర్ 7 ప్రభాతవార్త:** మత్స్యకారుల కుటుంబాలను ఆదుకోవడమే తెరాస ప్రభుత్వ లక్ష్యమని తెరాస రాష్ట్ర నాయకులు ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి తనయుడు ఎం.రోషన్‌రెడ్డి అన్నారు. బుధవారం సిర్గాపూర్ మండల కేంద్రమైన సాక్కి చెరువులో రోషన్‌రెడ్డితో పాటు సిర్గాపూర్ ఎంపీపీ అధ్యక్షులు మహిపాల్‌రెడ్డి, జడ్పీటీసీ రాఘవరెడ్డి, ఆత్మ కమిటీ ఛైర్మన్ రాంసింగ్ తదితరులు సాకి చేరువులో మత్స్యకారులకు ఉపాధి కొరకు చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మన ముఖ్యమంత్రి కేసీఆర్ మత్స్యకారుల కుటుంబాలను ఆదుకునేందుకు ఎన్నో నిధులు కేటాయించి ఆదుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ గ్రామ అధ్యక్షులు సాయిలు, ఇస్మాయిల్, జీ.నర్సింలు, లక్ష్మయ్య, మండల సోషల్ మిడియా అధ్యక్షులు రమేష్, గ్రామ యూత్ అధ్యక్షులు నర్సాగౌడ్, వార్డు మెంబర్ రమేష్, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### నేడు ఖేడ్‌లో కార్యవర్గ సమావేశం

**నారాయణఖేడ్, డిసెంబర్ 7 ప్రభాతవార్త:** తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల టీయూడబ్ల్యుజే హెచ్- 143 నారాయణఖేడ్ డివిజన్ కార్యవర్గ సమావేశం నిర్వహిస్తునున్నట్లు టీయూడబ్ల్యుజే హెచ్ 143 యూనియన్ బాధ్యులు శ్రీకాంత్ కులకర్ణి, అమృతం, పి.సంజీవ్‌లు తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ నేడు జరిగే టీయూడబ్ల్యు జే సమావేశానికి తెలంగాణ రాష్ట్ర నాయకులు మిడియా అకాడమీ ఛైర్మన్ అల్లం నారాయణ, అందోలు ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డితో పాటు రాష్ట్ర నాయకులు హాజరవుతున్నట్లు వారు తెలిపారు. ఖేడ్ మండలంలోని జగన్నాథ్‌పూర్ వద్ద గల అశోక్‌శెట్కార్ ఫామ్‌హౌస్‌లో మధ్యాహ్నం 12 గంటలకు జర్నలిస్టుల సమావేశం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**జిన్నారం, డిసెంబరు 7, ప్రభాతవార్త:** ఈ నెల 8వ తారీఖున గుమ్మడిదల 132 కేవి/33కేవి సబ్ స్టేషన్‌లలో మరమ్మత్తుల కారణంగా ఉమ్మడి జిన్నారం మండలంలోని ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏడిఇ శ్రీకాంత్, జిన్నారం, బొంతపల్లి విద్యుత్ ఏఇలురాజు, రవీందర్‌లు సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఉమ్మడి జిన్నారం మండలంలోని ఆయా 33 కేవి/11 కేవి సబ్‌స్టేషన్‌లకు, గుమ్మడిదల, బొంతపల్లి, దుండీగల్ ఎయిర్ ఫోర్స్ అకాడమీ, జిన్నారం, గడ్డపోతారం, సోలక్‌పల్లి, ప్రకృతి నివాస్ విద్యుత్ ఉపకేంద్రాలకు విద్యుత్ సరఫరా ఉండదని సూచించారు.

### మండల యుటిఎఫ్ నూతన కార్యవర్గం

**మనూర్, డిసెంబరు 7, ప్రభాతవార్త:** మండల టిఎస్ యుటిఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీతవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాశీనాథ్, పరిశీలకులు బి యేసప్పలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల అధ్యక్షులుగా జి జ్యోతి లింగం, ప్రధాన కార్యదర్శిగా ఎస్ రాములు, ఉపాధ్యక్షులుగా జే సంగయ్య, మహిళా ఉపాధ్యక్షురాలుగా కే సంగమణి, కోశాధికారిగా ఎం వీరయ్య, ఆడిటర్‌గా పి కాంతయ్య, మండల కార్యవర్గ సభ్యులుగా పుత్లిబాయ్ ధన్సింగ్, జిల్లా కార్యవర్గ సభ్యులుగా కే రవీందర్‌లు ఎన్నికైనట్లు ప్రకటించారు.

### మోర్గిలో ప్రజల వద్దకు ఆర్టీసి

**నాగల్‌గిద్ద, డిసెంబరు 7, ప్రభాతవార్త:** మండలంలోని మోర్గి గ్రామంలో బుధవారం ప్రజల వద్దకు ఆర్టీసి కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామం నుంచి కర్ణాటకలోని బీదర్ పట్టణానికి బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామ సర్పంచ్, ఎంపిటిసి సభ్యులు నారాయణఖేడ్ ఆర్టీసి డిపో మేనేజర్ మనేషయా,అసిస్టెంట్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్‌ల దృష్టికి తీసుకుపోయారు. బీదర్ పట్టణానికి బస్సు సౌకర్యం కోసం అధికారులు రోడ్డు సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు బసవరాజు పాటిల్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రమేష్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, డిపో మార్కెటింగ్ సెల్ ఇంచార్జి పాండు, సిబ్బంది శివశంకర్ పాల్గొన్నారు.

### నాగల్‌గిద్ద ఎస్ఐగా దశరథ్



ప్రజల వద్దకు ఆర్టీసి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

**నాగల్‌గిద్ద, డిసెంబరు 7, ప్రభాతవార్త:** నాగల్‌గిద్ద పోలీసు ఠాణా ఎస్ఐగా దశరథ్ బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరంచారు. ఇంత వరకు ఎస్ఐగా విధులు నిర్వహించిన విజయ్‌రావు జిల్లాలోని జిన్నారం పోలీసు స్టేషన్‌కు పోలీసు ఉన్నతాధికారులు బదిలీ చేశారు. సంగారెడ్డి విఆర్‌లో ఉన్న దశరథ్‌ను ఎస్పీ రమణకుమార్ దశరథ్‌ను నాగల్‌గిద్ద ఠాణాకు బదిలీ చేయగా బుధవారం దశరథ్ స్టేషన్‌కు చేరుకుని బాధ్యతలు స్వీకరించారు. ఠాణాలో బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ దశరథ్‌ను సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరు తమ వంతు పోలీసులకు సహకరించాలని దశరథ్ సూచించారు.

## భారత త్రివిధ దళా సంక్షేమానికి చేయూతనందించాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్**

**సంగారెడ్డి బ్యూరో, డిసెంబర్ 7, ప్రభాతవార్త:** దేశ రక్షణ కోసం, భారత ప్రజల సుఖశాంతుల కోసం తమ జీవితాలను త్యాగం చేస్తున్న భారత త్రివిధ దళాల సేవలు మరువలేనివని, వారి సంక్షేమానికి ప్రతి ఒక్కరూ చేయూతనందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ శరత్ పిలుపునిచ్చారు. బుధవారం సాయిధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ శరత్ తన వంతు విరాళాన్ని అందజేశారు. దేశభద్రతలో భాగంగా శత్రువల దాడులలో అమరులైన మాజీ సైనికులకు, మాజీ సైనిక వింతతువులకు, సైనికులకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. దేశభద్రతలో భాగంగా తమ ప్రాణాలను సైతం ఖాతరు చేయకుండా, ప్రజలకు రక్షణ కవచంగా ఉంటున్నారని, వారి సేవలు మరువరానివని కొనియాడారు. మరణించిన సైనిక కుటుంబాల సంక్షేమానికి మనవంతు బాధ్యతగా తోచిన సాయం అందించి వారిని ఆదుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. విరాళాలు సేకరిస్తున్న ఎన్‌సిసి విద్యార్థులను బాగా చదువుకొని ఉన్నతంగా ఎదగాలని కలెక్టర్ ఉద్బోదించారు. అన్ని చేతులు కలిస్తే చిన్న సాయమే పెద్దదవుతుందని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో రీజినల్ సైనిక సంక్షేమ శాఖ అధికారి ఎన్ శ్రీనేష్ కుమార్, సిబ్బంది సరస్వతి, నాగేశ్వరావు, మాజీ సైనికులు దశరథ్, లక్ష్మీనారాయణ, నర్సింలు, రాములు, చంద్రసేనుడు, ఎన్‌సిసి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పేకాట రాయుళ్లుకు అడ్డాగా పాఠశాల

## పాఠశాల తలుపులు బద్దలు కొట్టి.. బడిలోనే పేకాట



పాఠశాలలో బద్దలు కొట్టిన తలుపులను పరిశీలిస్తున్న సర్పంచ్ అంజి యాదవ్

**అల్లాదుర్గం, డిసెంబర్ 7, ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాల తలుపులు బద్దలు కొట్టారు... అందులోనే పేకాట స్థావరంగా మార్చారు. నిత్యం పాఠశాల సమయం ముగిశాక సాయంత్రం వేళలో కొందరు పేకాట రాయుళ్లు పాఠశాలనే స్థావరంగా చేసుకొని అందులోనే మద్యంతాగి, సీసాలు వదిలివెళ్లిపోవడం జరుగుతుంది. మెదక్ జిల్లా అల్లాదర్గం మండల కేంద్రంలోని సిపిఎస్ బాలుర పాఠశాలలో కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు పాఠశాల తలుపులను బద్దలు కొట్టి, లోపలికివెళ్లి అందులో మద్యంతా గుతూ పేకాట ఆడుతున్నారు. పాఠశాల సమయంలో బుధవారం నాడు తలుపులు తీసేందుకు వెళ్లగా తలుపులు బద్దలు కొట్టి లోపల పేకాట ఆడినట్లు ఆన వాళ్లు ఉన్నాయి. దీంతో పాఠశాల ప్రధానోపాధ్యా యుడు విఠల్ పాఠశాల గదిలో మద్యం సీసలు కనబడడం చూసి స్థానిక సర్పంచ్ అంజి యాదవ్‌కు సమాచారం అందించారు. సర్పంచ్ అంజి యాదవ్ పాఠశాలకు వెళ్లి పరిశీలించగా గుర్తుతెలియని వ్యక్తులు పగలగొట్టిన తలుపులను, మద్యం సీసాల ను చూశారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికోసం లక్షలాధి రూపాయలు ఖర్చుపెడుతూ విద్యాభివృద్ధికి కృషిచేస్తూంటే కొందరు పాఠశాలను పేకాట స్థావరా లుగ ఏర్పాటు చేసుకుంటున్నారు. పాఠశాలలే... దేవాలయాలుగా భావించే పాఠశాలలను అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారడం చాలా భాదకర మైన విషయంగా స్థానికులు,ప్రజలు, ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొందరు పనిపాట లేని వ్యక్తులు పాఠశాలలోని తలుపులను దర్జాగ బద్దలుకొట్టి పాఠశాలలోనే ఇలాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని ప్రధానోపాధ్యాయులు విఠల్ తెలిపారు. ఈ పాఠశాలల్లో 1-5 తరగతి వరకు 76 మందితో పాఠశాల కొనసాగుతుందని, పాఠశాలలో పాఠశాలకు సంబంధించిన సామాగ్రి ఉన్న వాటిని గుర్తుతెలియని వ్యక్తులు వాటిని ముట్టుకోలేదని ఆయన తెలిపారు. గత రెండు మూడు రోజులుగా ఈ ప్రాంతంలో జూనియర్ కళాశాల, ప్రభుత్వ జెడ్పిహెచ్ బాలుర పాఠశాల, పక్కనే ఎంఈఓ కార్యాలయం వీటి మధ్యలోనే ఈ సిపిఎస్ పాఠశాల ఉందని, పాఠశాల ముగింపు తరువాత ఈ పాఠశాలలోనే కొందరు వ్యక్తులు వచ్చి పేకటా అడ్డగా మార్చుకొంటున్నారని, తమ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించాలని, ఓ వైపు తల్లిదండ్రులు పాఠశాలకు పంపిస్తే మరో వైపు పేకాట రాయుళ్లు పాఠశాలనే పేకాట స్థావరంగా మార్చుకున్నారనడానికి ఈ తలుపులు బద్ధలు కొట్టడం చూస్తే స్పష్టంగా తెలుస్తుందన్నారు. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేసి నట్లు హెచ్‌ఎం తెలిపారు. ఇకనైన దేవాలయాలు భావించే పాఠశాలల్లో అసాంఘిక కార్యాక్రమాలను జరుగకుండా చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యా యులు విఠల్ కోరారు.



పాఠశాలలో తాగి మద్యం సీసాలను వదిలేసిన దృశ్యం




మైనార్టీ గురుకులంలో మాట్లాడుతున్న ఏయిర్ ఫోర్స్ ఛీఫ్ కమాండింగ్ అధికారి

## అల్గోల్‌లో జాతీయ త్రివిధ దళాల పతాక దినోత్సవం

**జహీరాబాద్, డిసెంబరు 7, ప్రభాతవార్త:** మండలంలోని అల్గోల్ మైనార్టీ గురుకుల పాఠశాలలో బుధవారం జాతీయ త్రివిధ దళాల పతాక దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి ఎయిర్ ఫోర్స్ చీఫ్ కమాండింగ్ అధికారి సజ్జాశ్రీ చైతన్య, రిటైర్డ్ సుబేదార్ మేజర్ ఎంఎ మాజీద్‌లు హాజరై కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అగ్నివీర్, అగ్ని వాయు పథకాల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు ఆయా రంగాల్లో రాణించేందుకుఉత్తమ ప్రతిభను చాటుకోవాల్సి న అవసరం ఉందన్నారు. విద్యార్థులు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మైనార్టీ గురుకులం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సంబంధించిన నీట్, ఎన్‌డిఎ విద్యార్థులు పాల్గొని తమ సందేహాలను నివృతి పర్చుకున్నారు. ముఖ్య అతిథులను పాఠశాల,కళాశాల ప్రిన్సిపాల్ రాములు, కెఎస్ జమీల్‌లు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎయిర్ ఫోర్స్ సిబ్బంది జి పాల్,కె రాకేష్, మొహమ్మద్ ఆరీఫ్, కళాశాల అకాడమిక్ కో-ఆర్డినేటర్ మక్సుద్ ఆహ్మద్, పాఠశాల డిప్యూటీ వార్డెన్ సంయుద్దీన్, జూనియర్ అసిస్టెంట్ ఇర్ఫాన్, పిఇటిలు యంఅనీల్, ఖాసీం, భోధన సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## టిఎస్‌యుటిఎఫ్ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



ప్రభుత్వ పాఠశాలలో ప్రచారం చేస్తున్న టిఎస్‌యుటిఎఫ్ జిల్లా నాయకులు

**సంగారెడ్డి మున్సిపాలిటీ, డిసెంబర్ 7, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ టిఎస్‌యుటిఎఫ్ సంగారెడ్డి జిల్లా 5వ మహాసభలను డిసెంబర్ 10, 11 తేదీలలో అంబేడ్కర్ భవన్ సంగారెడ్డి నందు జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం సంగారెడ్డి మండలంలోని అన్ని పాఠశాలలు సందర్శించి ప్రచారం నిర్వహించడం జరిగింది. టిఎస్‌యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి సాయిలు మాట్లాడుతూ ఉపాధ్యాయుల పదోన్నతులు బదిలీలు చేపట్టడానికి షెడ్యుల్ వెంటనే ప్రకటించాలని సిపిఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిఎస్‌యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కే అశోక్ కోశాధికారి పి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శులు కే కృష్ణమూర్తి, బి సాయితేజ, సిహెచ్ కృష్ణంరాజు, నాయకులు ఆర్ సింహాచలం, విజయనంద్, కృష్ణమూర్తి, నరసింగరావు, ఎం సుచరిత, మంజుల తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**అల్లాదుర్గం సిఐ జార్జ్**

**అల్లాదుర్గం, డిసెంబర్ 7, ప్రభాతవార్త:** మెదక్ జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని ఆదేశాల మేరకు అల్లాదుర్గం సర్కిల్ కార్యాలయంలో బుధవారం నాడు విలేకరుల సమావేశంలో అల్లాదుర్గం సిఐ జార్జ్ మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. రోజు రోజుకు సైబర్ నేరగాళ్ళు కొత్త రకంగా ఆలోచిస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. ఫేస్ బుక్, ట్విట్టర్, యాప్‌ల ద్వారా పరిచయాల పెంచుకొని మాయ మాటలు చెప్పి ప్రజలను మోసం చేసి ప్రజల నుండి డబ్బులను కాజేస్తున్నారని అన్నారు. ఇంటర్ నెట్‌లో గుర్తు తెలియని వ్యక్తులతో పరిచయాలు పెంచుకోవద్దన్నారు. క్రెడిట్, కార్డులు, ఏటీఎం కార్డుల వివరాలు అడిగితే వేరే వ్యక్తికి తెలియపరచకుడదని అన్నారు. గ్రామాలలో ఫ్లిప్‌కార్డు, కొరియర్ వచ్చింది మీకు ఒక ఓటిపి చెప్పండి అంటూ ఫోన్ చేస్తే ఎవ్వరు చెప్పవద్దని అన్నారు. మీరు ఎవరైనా మోసపోయినట్లయితే 1930 టోల్ ఫ్రీ నెబరుకు సంప్రదించగలరని, అపరిచిత వ్యక్తులను గుర్తిస్తే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం వెంటనే అందించాలని అల్లాదుర్గం సిఐ జార్జ్ పేర్కొన్నారు.



దత్త జయంతి సందర్భంగా భిక్షాటన కార్యక్రమం దృశ్యం

## పేటలో ఘనంగా దత్త జయంతి వేడుకలు

**దత్తజోలె ద్వారా భిక్షాటన, డోలారోహణము**

**సంగమేశ్వరాలయ పూజారి బ్రహ్మశ్రీ మోహన్‌రావు**

**సదాశివపేట, డిసెంబర్ 7, ప్రభాతవార్త:** దత్త పౌర్ణమిని పురస్కరించుకొని సదాశివపేట పట్టణంలో బుధవారం దత్త జయంతి వేడుకలను స్థానిక సంగమేశ్వర ఆలయ కమిటి పూజరులు బ్రహ్మశ్రీ మోహన్‌రావు, బిఎన్ నారాయణరావుల అధ్వర్యంలో జయంతి వేడుకలను స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దత్త జోలి ద్వారా పట్టణంలో భిక్షాటన చేశారు. సాయంత్రం 6గంటలకు ఆలయంలో దత్తాత్రేయ డోలారోహణం, పూజలు నిర్వహించి పాల్గొన్న భక్తులందరికి తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన ప్రసాద వితరణ చేశారు. శ్రీ సాయి సేవ సంస్థాన్ దత్తాత్రేయ ఆలయం, శ్రీ మాణిక్‌ప్రభు ఆలయంతో పాటు తదితర ఆలయాలలో స్వామి వారికి డోలారోహణ చేసి తీర్థప్రసాదాలు, అన్నదాన వితరణ చేశారు. సంగమేశ్వరాలయంలో పూజారులు మోహన్‌రావు ఈ సందర్భంగా మాట్లాడుతూ దైవ కృపతోనే ప్రజలు సుభిక్షమని, నిత్యం కొంత సమయం భగవాన్ నామస్మరణ చేయాలన్నారు. దత్తాత్రేయుని కృపతో సుభిక్షంగా ఉండాలని వేడుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి పెద్దలు ఆకుల శివకుమార్, ముంగి మల్లేశం, శివకుమార్, చిన్న రాం రెడ్డి, సుధాకర్, సుబ్రహ్మణం, పరమేశ్వర్, మణికంఠ, నాగు, ప్రభు, కుమార్, మహిళా విభాగం లీలావతి, మోహన్‌రావు, నాగ శైలజ, అన్నపూర్ణ, విజయలక్ష్మి, జయలక్ష్మి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## జువినైల్ జస్టీస్ చట్టంపై శిక్షణ




జువినైల్ జస్టీస్ చట్టంపై శిక్షణ తరగతి నిర్వహిస్తున్న దృశ్యం

**సంగారెడ్డి టౌన్, డిసెంబరు 7, ప్రభాతవార్త:** జాతీయ, రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలు, సూచనల మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జె హన్మంతరావు ఆధ్వర్యంలో జువినైల్ జస్టీస్ చట్టం, 2015పైబాల సంరక్షణ అధికారులకు, పోలీసు అధికారులకు బుధవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సంగారెడ్డిలోని కోర్టు హాల్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ శిభిరానికిముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి యస్ శశిధర్‌రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ చిన్నారుల కొరకు, వారి భవిష్యత్తుకై ఈ చట్టం తీసుకువచ్చినట్లు గుర్తు చేశారు. చిన్నారుల హక్కులను ప్రతి ఒక్కరు కాపాడాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. న్యాయమూర్తులు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయమూర్తులు, న్యాయవాదులు జి సుదర్శన్, పి రాజు, యం రాధాక్రిష్ణా చౌహాన్, యస్ శాలిని, డిడబ్లుఓ పద్మావతి, పోలీసు అధికారులు, బాల సంరక్షణ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## యువత స్వచ్ఛందంగా ఓటు నమోదులో పాల్గొనాలి

**ఎన్నికల జిల్లా ప్రత్యేక అధికారి నిర్మల**



అధికారులకు సూచనలు ఇస్తున్న ఎన్నికల జిల్లా ప్రత్యేక అధికారి నిర్మల

**గుమ్మడిదల, డిసెంబర్ 7, ప్రభాతవార్త:** గుమ్మడిదల మండలం కేంద్రంలో తాహసిల్దార్ కార్యాలయానికి ఎన్నికల ప్రత్యేక అధికారి, సంగారెడ్డి జిల్లా ఇంఛార్జ్ నిర్మల బుధవారం ఆకస్మికంగా విచ్చేసింది. ఈ సందర్భంగా ఆమె అధికారులకు సూచనలు, నియమ నిబంధనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్ నమోదు కార్యక్రమంలో 18 సంవత్సరాలుపైబడిన వారు స్వచ్ఛందంగా ఓటర్ నమోదు కార్యక్రమం చేసుకొని గుర్తింపు కార్డును పొందాలని, అలాగే అధికారులకు గ్రామాలలో ఎవరైనా చనిపోయిన, లేక వేరే ప్రాంతం నుంచి ఈ ప్రాంతానికి మారిన వివాహం చేసుకొని వచ్చిన వారిని ప్రత్యేకంగా గుర్తించి గుర్తింపు కార్డులను సరిచేయాలని ఆమె సంబంధిత అధికారులకు సూచించారు. బిఎల్‌ఓ సహాయకుల చేత ఇంటింటి కార్యక్రమం నిర్వహించి వివరాలు సేకరించి 100 శాతం ఓటర్ నమోదు కార్యక్రమం నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ సుజాత, ఉప తాహసిల్దార్ చంద్రశేఖర్, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మృతిచెందిన కుటుంబానికి ఆర్థికసహాయం అందజేస్తున్న దృశ్యం

## నిరుపేద కుటుంబానికి అండగా ఎమ్మెల్యే

**గుమ్మడిదల, డిసెంబర్ 7, ప్రభాతవార్త:** గుమ్మడిదల మండలం కానుకంట గ్రామానికి చెందిన సుక్క వసంత అనారోగ్యంతో మృతి చెందారు. గ్రామ టిఆర్ఎస్ పార్టీ నాయకుల ద్వారా సమాచారాన్ని తెలుసుకున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సుక్క వసంత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ తన సోదరుడు గూడెం మధుసూదన్‌రెడ్డి ద్వారా 10 వేల ఆర్థిక సహాయం అందజేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామ టిఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షులు జంగిటి మల్లేష్, ప్రధాన కార్యదర్శి తుడుం కాంతారావు, గ్రామ ముదిరాజన సంఘం అధ్యక్షులు పుట్ట నాగులు, గుండ గల రాజు, మహేష్, రాజయ్య, సహదేవ్, నాగరాజు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు భావిశాస్త్రవేత్తలు తయారు కావాలి

**రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్**




జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ అవార్డ్, ప్రదర్శనల కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్

**సంగారెడ్డి బ్యూరో, డిసెంబర్ 7, ప్రభాతవార్త:** విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని, ప్రతిభను గుర్తించి తగిన విధంగ ప్రోత్సహిస్తే ప్రతి విద్యార్థి భావిశాస్త్రవేత్తలుగా తయారవుతారని రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. బుధవారం సంగారెడ్డి పట్టణంలోని సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్‌లో మూడు రోజులపాటు నిర్వహించిన జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ అవార్డ్, ప్రదర్శనల కార్యక్రమానికి చింతా ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జవహర్‌లాల్ నెహ్రు జాతీయ వైజ్ఞానికి, గణిత ప్రదర్శనలో 409 మంది విద్యార్థులు, 409 ఎగ్జిబిట్స్‌లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడుతూ విద్యార్థులలో శాస్త్రీయ నైపుణ్యాలను పెంపొందించి భావిశాస్త్రవేత్తలను తయారు చేయాలన్నారు. కాలానికి అనుగుణంగా శాస్త్రీయ, సాంకేతికతను అందిపుచ్చుకుని తమలో ఉన్న ప్రతిభను వెలికి తీసుకురావాలని విద్యార్థులకు ఆయన ఉద్బోదించారు. విద్యార్థులలో సృజనాత్మకతను పెంచే విధంగా విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకే ఇన్‌స్పైర్ ప్రదర్శలను దోహదం చేస్తాయని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాలను తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని ఆయన హితవు పలికారు. ఈ కార్యక్రమలో మున్సిపల్ చైర్ పర్సన్ బొంగుల విజయలక్ష్మి, వైస్ చైర్మన్ లతావిజయేందర్‌రెడ్డి, జిల్లా విద్యాధికారి నాంపల్లి రాజేష్, జిల్లా సైన్స్ అధికారి విజయకుమార్, డిప్యూటీ డిఈఓలు, ఎంఈఓలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు అండగా టిఆర్ఎస్ ప్రభుత్వం

**భారతీనగర్ కార్పొరేటర్ వెన్నవరం సింధుఆదర్శ్‌రెడ్డి**



చెక్కులను అందజేస్తున్న కార్పొరేటర్ సింధుఆదర్శ్‌రెడ్డి

**రామచంద్రాపురం, డిసెంబర్ 7, ప్రభాతవార్త:** భారతీనగర్ కార్పొరేటర్ వెన్నవరం సింధుఆదర్శ్‌రెడ్డి డివిజన్‌లో ఉన్న లబ్ధిదారులకు బుధవారం నాడు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కష్టాల్లో ఉండే నిరుపేద ప్రజలకు ఆదుకోవడంలో అనేక సంక్షేమ పథకాలు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిందన్నారు. వైదర్యం చేయించుకునేందుకు ఆర్థిక ఇబ్బందులు ఉన్నవారు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహకారం అందిస్తామన్నారు. ఈ సందర్భంగా బొంబాయి కాలనీకి చెందిన కిరణ్ కుమార్ కు 60 వేల రూపాయలు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. అదే విధంగా ఎంఐజీ కాలనీలోని సాయిబాబా ఆలయంలో నిర్వహించిన దత్తజయంతి మహోత్సవాలకు కార్పొరేటర్ సింధుఆదర్శ్‌రెడ్డి పాల్గొని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కార్పొరేటర్‌కు ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అనిత, ప్రసాద్, సావిత్రి, డైరెక్టర్, సత్యనారాయణ, రాకేష్, రాధ తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం



గార్లపల్లి-చీలపల్లి గ్రామాలలో సీసీ రోడ్డుపనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీల దృశ్యం

**మునిపల్లి, డిసెంబర్ 7, ప్రభాతవార్త:** బుధవారం నాడు మునిపల్లి మండలంలోని చీలపల్లి-గార్లపల్లి గ్రామాల్లో అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ సూచనలమేరకు ఎస్‌డిఎఫ్ నిధుల నుండి మంజూరైన 25 లక్షల విలువగల సిసి రోడ్డు డ్రైనేజ్ పనులను మునిపల్లి ఎంపీపీ గౌడిగామశైలజశివశంకర్, జెడ్పీటీసీ పైతర మీనాక్షిసాయి కుమార్‌ల చేతులమీదుగా ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం కెసిఆర్ కృషితో అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ప్రత్యేక చొరవతో మునిపల్లి మండలానికి నిధులు అధికంగా మంజూరవుతున్నాయనీ గ్రామాల్లో రోడ్లకు, మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని వారన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు పైతర సాయి కుమార్ రామచంద్రరావు, చీలపల్లి సర్పంచ్ వీరన్న పాటిల్ గార్లపల్లి సర్పంచ్ ఎంపీటీసీలు రేణుకావెంకటేశం, లక్ష్మీనాగేష్, శంకరయ్య, ఎఎంసీ డైరెక్టర్ శ్రీనివాస్, గ్రామాల అధ్యక్షులు మొగులయ్య, ఈశ్వరప్ప, సురేష్, పెద్దలోడి, చిలపల్ల, గార్లపల్లి రైతుబంధు అధ్యక్షులు నరేష్, రాజు, నాగేంధర్, గార్లపల్లి ఉపసర్పంచ్ రాములు సిద్దిరామప్ప పాల్గొన్నారు.

## సనాతన ధర్మాన్ని ప్రతి ఒక్కరు పాటించాలి

**ఝరాసంగం, డిసెంబరు 7, ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరు సనాతన ధర్మాన్ని, సాంప్రదాయ, సంస్కృతులను పాటించాల్సిన అవసరం ఉందని మండలంలోని బర్దీపూర్ దత్తగిరి ఆశ్రమ పీఠాధాపతులు వైరాగ్య శిఖామణి శ్రీశ్రీశ్రీ 108 అవదూతగిరి మహారాజ్ (అప్పగారు), డాక్టర్ సిద్ధేశ్వరానందగిరి మహారాజ్‌లు పేర్కొన్నారు. ఆశ్రమంలో కొనసాగుతున్న 21 యజ్ఞములలో శ్రీ దత్త హోమాలు బుధవారంతో 2వ రోజుకు చేరుకున్నాయి. ఆశ్రమ ఆవరణతో పాటు గ్రామం దత్తగిరి నామస్మరణతో మార్మోగుతోంది. ఉదయం నుంచి ఆశ్రమంలో నిత్య పూజలతో పాటు రుద్ర సహిత దత్త యజ్ఞం పూజా కార్యక్రమాలు వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఆశ్రమ పీఠాధిపతులు మాట్లాడుతూ లోక కళ్యాణార్థం దత్తగిరి శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని 100 రోజులు రుద్ర సమిత దత్త యజ్ఞం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. యజ్ఞాలతో సమాజానికి అనేక ఉపయోగాలు కల్గుతాయన్నారు. తీరిక లేకుండా నేటి రోజుల్లో ప్రజలు పనుల్లో నిమగ్నమై పోతున్నారని, శారీరక, మానసిన ప్రశాంతత కొరకు ప్రతి



ఒక్కరు యాగంతో ప్రశాంతత పొందవచ్చున్నారు. యజ్ఞం నుంచి వెలువడే హవనం 100 కిలో మీటర్ల పరిసరాల్లోని కాలుషితమైన గాలిని శుద్ధి చేస్తుందన్నారు.

### నేడు దత్తగిరిలో దత్త జయంతి ఉత్సవాలు

మూడు రోజులుగా కొనసాగుతున్న దత్త యజ్ఞాలు దత్త జయంతిని పురస్కరించుకుని గురువారం పూర్ణాహుతి నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ పీఠాధిపతులు పేర్కొన్నారు.